ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా చెత్త సేకరిస్తున్నాం

చెత్త సేకరణ వాహనాలను కంపెనీ వారు వెనక్కి తీసుకెళ్లడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలో చెత్తను సేకరిస్తున్నాం. ప్రస్తుతం మున్సిపాలిటీకి సంబంధించిన 5 ఆటోలు, 5 ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తుండగా మరో 8 ట్రాక్టర్లను బాడుగకు తీసుకుని చెత్త సమస్య లేకుండా చూస్తున్నాం. గతంలో క్లాప్ ద్వారా నడుస్తున్న చెత్త సేకరణ ఆటోల ఏజెన్సీ వారు డిఫాల్ట్ కావడంతో కంపెనీ వారు వాటిని తీసుకెళ్లారు. త్వరలోనే స్వచ్ఛ ఆంధ్ర కింద ప్రభుత్వం వాటిని తిరిగి తీసుకోనుంది. దీంతో యధావిధిగా చెత్త సేకరణ చేపడతాము.

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి

చెత్తబండి రాలేదండి...

- బండ్లు పోయాయి... పాట ఆగింది...
- డబ్బులు కట్టలేదని కంపెనీ వాళ్లు చెత్తబండ్లను తీసుకెళ్లారు
- మున్సిపాలిటీలో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం
- జిల్లా కేంద్రంలో చెత్త సేకరణ సమస్య

చెత్తబండి వచ్చింది.. బుట్టలు తీసుకురారండి.. తడి.. పొడి చెత్త వేరుగా తీసుకురండి.. అంటూ వీధుల్లో వినిపించే పాట ఆగిపోయింది. చెత్తబండ్లను నిర్వహించే ఏజెన్సీ వారు డబ్బులు కట్టలేదని కంపెనీ వాళ్లు వాటిని తీసుకెళ్లిపోయారు. మున్సిపాలిటీ వారు ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నా చిన్న చిన్న సందుల్లోకి ట్రాక్టర్లు రాకపోవడంతో కొందరు రోడ్ల పక్కనే చెత్త వేస్తున్నారు. మున్సిపాలిటీ వారు ప్రతిరోజు అన్ని వీధుల్లోకి వచ్చి చెత్త సేకరించాలని ప్రజలు కోరుతున్నారు.



రాయచోటిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీలో 20 రోజులుగా చెత్త బండి వచ్చిందో.. అనే పాట వినబడడం లేదు. చెత్త సేకరణ చేస్తున్న వాహనాల కంపెనీకి ఏజెన్సీ వారు డబ్బులు చెల్లించకపోవడంతో చెత్త బండ్లను వారు తీసుకెళ్లిపోయారు. దీంతో రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో మున్సిపాలిటీ వ్యాప్తంగా 34 వార్డుల్లో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తోంది. చెత్త సేకరణ కోసం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ ట్రాక్టర్లు రెండు, మూడు రోజులకు ఒకసారి వీధుల్లోకి వస్తుండడంతో పట్టణ ప్రజలకు చెత్త సమస్య తలనొప్పిగా మారింది. మున్సిపాలిటీ నుంచి చెత్త సేకరణ కోసం వస్తున్న ట్రాక్టర్లు కేవలం ప్రధాన రోడ్లకు పరిమితం అవుతుండడంతో చిన్న చిన్న సందుల్లో ఉన్న వారు చెత్తను రెండు, మూడు రోజులకు ఒకసారి ట్రాక్టర్లలో వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియక ప్రజలు రోడ్ల పక్కనే వేస్తున్నారు.



కొత్తపేట బాలాజీనగర్‌లో నివాసాల మధ్య చెత్త దిబ్బ

34 వార్డులు.. 24 చెత్త బండ్లు

రాయచోటి మున్సిపాలిటీలోని 34 వార్డుల్లో చెత్త సేకరణ కోసం గత ప్రభుత్వ హయాంలో క్లాప్ పథకం కింద 24 చెత్త సేకరణ వాహనాలను ఏజెన్సీ వారు నిర్వహించేవారు. అయితే చెత్త సేకరణ వాహనాలకు సంబంధించిన డబ్బులను కంపెనీ వారు ఏజెన్సీ వారికి సక్రమంగా చెల్లించకపోవడమే కాకుండా డ్రైవర్లకు కూడా సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో చెత్త సేకరణ వాహనాల నిర్వహణ పూర్తి స్థాయిలో అమలు కాకుండాపోయింది. దీనికి తోడు వాహనాలకు నెల నెలా చెల్లించాల్సిన ఈఎంఐలు కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో కంపెనీ వారు చెత్త సేకరణ వాహనాలను తీసుకెళ్లారు. ఇందులో భాగంగానే రాయచోటి మున్సిపాలిటీలో 34 వార్డుల్లో చెత్త సేకరణ చేస్తున్న 24 వాహనాలను వెనక్కి తీసుకెళ్లారు. ఫలితంగా చెత్త సేకరణ సమస్యగా మారింది. దీంతో పట్టణ ప్రజల ఫిర్యాదుల మేరకు మున్సిపల్ అధికారులు అరకొరగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తోపుడు బండ్లను ఏర్పాటు చేసి చెత్త సేకరణ చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి, కొత్తపేట రామాపురం, రవి హాల్, సాహిత్య హాల్, గాంధీ బజార్, మార్కెట్ వీధి, కొత్తపేట, గున్నికుంట్ల రోడ్డు, మండీల వీధి తదితర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలు కంపుకొడుతూ దర్శనమిస్తున్నాయి.




అల్తాఫ్ కల్యాణ మండపానికి సమీపంలో రోడ్డు పక్కన చెత్త దిబ్బ



కొత్తపేట అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ వీధిలో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

కంపు కొడుతున్న డ్రైనేజీలు

మున్సిపాలిటీలో చెత్త సేకరణ కోసం గతంలో నడిచే చెత్త సేకరణ వాహనాలను కంపెనీ తిరిగి వెనక్కి తీసుకెళ్లడంతో కార్మికులంతా రోడ్లపైన చెత్త ఊడ్చడంతో పాటు తోపుడు బండ్ల ద్వారా చెత్తను తీసుకెళ్లడం తదితర పనులపై నిమగ్నం కావడంతో చెత్తాచెదారం, మురుగునీటితో డ్రైనేజీలన్నీ నిండిపోయి కంపు కొడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే మురుగునీరు పారుతుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి పట్టణ ప్రజలకు చెత్త బాధల నుంచి ఉపశమనం కలిగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చెత్త వాహనాలు లేకపోవడంతో ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరిస్తున్న దృశ్యం

హార్సిలీహిల్స్‌లో టెంట్ సిటీ

- పరిశీలన చేసిన జిల్లా పర్యాటకశాఖాధికారి నాగభూషణం



పర్యాటకుల కోసం ఏర్పాటు చేయనున్న టెంట్‌హౌస్‌లు

బి.కొత్తకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల ఆకర్షణ, సౌకర్యార్థం టెంట్‌సిటీ ఏర్పాటుపై జిల్లా పర్యాటకశాఖాధికారి నాగభూషణం బుధవారం ప్రాథమిక పరిశీలన చేశారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల కోసం టెంట్‌సిటీ ఏర్పాటు, అరకు కాఫీ తోటల తరహాలో కాఫీ తోటల సాగుకు అవకాశాలపై అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా టూరిజం అధికారి, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ ఛైర్మన్, మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘాస్వరూప్‌లను కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో టూరిజం జిల్లా అధికారి నాగభూషణం హిల్స్‌కు చేరుకుని పరిశీలించారు. భూమి కేటాయింపు, టెంట్ సిటీ, కాఫీ తోటల పెంపకానికి అయ్యే నిధుల విషయమై ప్రాథమిక అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై ఈ రెండు ప్రాజెక్టులను చేపట్టేందుకు గల అవకాశాలను కలెక్టర్ పరిశీలించమన్నారని, ఇది ప్రాథమిక దశలోనే ఉందని, టౌన్‌షిప్ కమిటీ ఛైర్మన్‌గా సబ్‌కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని, దీనికయ్యే బడ్జెట్‌ను బట్టి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు.

కోటలో మంటలు



మంటల్లో కాలుతున్న గుర్రంకొండ కోట

గుర్రంకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కట్టడమైన గుర్రంకొండ కోట ఆకతాయిలు పెట్టిన నిప్పుకు పూర్తిగా కాలిపోయింది. కొండకు వెనుక భాగంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ మంటలు కొండ చుట్టూ అలుముకుని పచ్చదనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సిబ్బంది మంటలు అదుపు చేయడానికి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో కొండలోని పచ్చదనం పోయి కళావిహీనంగా మారింది.

యువత, విద్యార్థులకు వైసీపీ అండ

- యువత పోరులో వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 8 నెలలు పూర్తయినా ఇప్పటి వరకు యువతకు, విద్యార్థులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం యువత పోరు పేరుతో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధుల చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇచ్చి మొత్తం 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. యువత, విద్యార్థులకు అండగా నిలిచేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చిందన్నారు. అనంతరం డీఆర్‌వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డీఆర్‌వోకు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు

కూటమి ప్రభుత్వం అభివృద్ధిని ఓర్వలేని వైసీపీ

- అవినీతి పార్టీ ఆవిర్భావం రోజున పోరు చేయడం విడ్డూరం
- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేని వైసీపీ, వైసీపీ ఆవిర్భావ రోజున పోరు చేయడం విడ్డూరంగా ఉందని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవమాసాలు కూడా పూర్తి కాని కూటమి ప్రజాపాలనను భరించలేకపోతున్నారా అని ఎద్దేవా చేశారు. ఈ 9 నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేకపోతున్నారా అని తెలిపారు. అసలు వైసీపీదే అవినీతి పుట్టుక అని, రాష్ట్రానికి పట్టిన దరిద్రం అని విమర్శించారు. యువతకు, మహిళలకు అన్నివర్గాల ప్రజలకు పేద, బడుగు, బలహీన వర్గాల వారికి న్యాయం చేస్తున్నది కూటమి ప్రభుత్వమేనన్నారు. జగన్‌ను రాజకీయంగా తరిమికొట్టినా, ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా ఇక వైసీపీ గురించి ప్రజలు పట్టించుకోకపోయినా ఆ పార్టీ అధినేత, ప్రధాన నాయకులు పార్టీ ఆవిర్భావం రోజు అంటూ వేడుకలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ఏ పోరు చేసినా ఇక ప్రజల మద్దతు ఉండదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఉన్న బలమేమిటో అర్థం కాలేదా అన్నారు. సమావేశంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, నందలూరు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లు రెడ్డయ్యనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతకు అధికారిక పదవి

- సీఎంవోకు టీడీపీ నేతల ఫిర్యాదు
- జిల్లా యంత్రాంగాన్ని తలంటిన సీఎంవో
- వీఎస్ రెడ్డిని రాజీనామా కోరిన అధికారులు
- సీఎంవోకు రాజీనామా పత్రంతో సర్దుబాటు



వైసీపీ నేత వీఎస్ రెడ్డి

మదనపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పార్టీ ఏదంటే ఎవరైనా క్షణం ఆలోచించకుండా ఠక్కున చెప్పేస్తారు. కూటమి ప్రభుత్వమని. అయితే రాజకీయంగా, అధికారికంగా పదవులు వస్తున్నది వరికి, అనుభవిస్తున్న దెవరనే ప్రశ్నవస్తే మాత్రం ఏ పార్టీ వారని ఠక్కున చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఇప్పటికీ చాలా మంది అధికారులు వైసీపీ పాలనలో ఉన్నట్లే వ్యవహరిస్తున్నారు.

టీడీపీలో ఇక్కడున్న గ్రూపులు ఒకటైతే, అధిష్ఠానం పెద్దగా పట్టించుకోకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు. తాజాగా జరిగిన సంఘటనను పరిశీలిస్తే... మదనపల్లెకు చెందిన వైసీపీ నేత, పేస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వీఎస్ రెడ్డిని జిల్లా వినియోగదారుల ఫోరం కార్యదర్శిగా నియమిస్తూ ఈనెల 7వ తేదీ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇదే వీఎస్ రెడ్డికి వైసీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం ఈనెల 8వ తేదీ ప్రకటన విడుదల చేసింది. ఈయన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడే అయినా వైసీపీలో కీలకంగా ఉంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డికి సహచరునిగా ఉన్నట్లు చెబుతున్నారు. ఈ అంశంపై స్థానిక టీడీపీ నాయకుల నుంచి టీడీపీ అధిష్ఠానానికి, సీఎంవోకు ఫిర్యాదులు వెళ్లాయి. అంతే అక్కడి నుంచి జిల్లా యంత్రాంగానికి తలంటారు. దీంతో అప్రమత్తమైన కలెక్టర్ ఆయనను వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శిగా ఎవరు సిఫార్సు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం డైరెక్ట్‌గా రంగంలోకి దిగిన కలెక్టర్ వీఎస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సీఎంవో నుంచి ఎదురైన పరిస్థితిని వివరించి ఆ పదవికి రాజీనామా చేయాలని కోరినట్లు సమాచారం.

మదనపల్లెలోని రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ సిబ్బంది బుధవారం వీఎస్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా తీసుకుని ఆ కాపీని కలెక్టర్‌కు, అక్కడి నుంచి సీఎంవో కార్యాలయానికి పంపించి సర్దుబాటు చేయడంతో కథ సుఖాంతమైంది.

చివరగా తెలిసిందేంటంటే వీఎస్ రెడ్డిని మదనపల్లెకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఈ పదవికి రెకమెండ్ చేయడంతో అధికారులు వెనుకాముందు ఆలోచించకుండా, విచారించకుండా ముందు కెళ్లినట్లు చెబుతున్నారు.



Yuvajana Sramika Rythu Congress Party

వీఎస్ రెడ్డిని మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వు

పటిష్టంగా 'పది' పరీక్షలు

వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా అధికారులు

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ విద్యా శాఖాధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి సీఎస్ విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పదో తరగతి పరీక్షల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో అన్ని శాఖల వారు సమన్వయంతో పనిచేసి పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
రాయచోటి	6.29	5.03
మదనపల్లె	6.31	5.10
రాజంపేట	6.28	5.11
పీలేరు	6.29	5.02

ఆకేపాటి ఎస్టేట్ అక్రమాలపై సీఎస్ ఆరా

- పూర్తి వివరాలతో సీఎస్‌కు నివేదిక

రాయచోటి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి చెందిన ఎస్టేట్‌లో అక్రమాలపై బుధవారం సాయంత్రం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆరా తీశారు. ఆకేపాటి ఎస్టేట్‌లో సుమారు 31 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సీఎం కార్యాలయం ఆదేశాలతో కలెక్టర్ ఆధ్వర్యంలో ఆ భూములపై అధికారులు విచారణ చేశారు. 100 ఎకరాలకు పైగా ఉన్న ఎస్టేట్‌లో 31 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నిగ్గు తేల్చారు.

ఈ భూములన్నింటిని అమర్‌నాథరెడ్డి తన భార్య, సోదరుడు, అతడి భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో వాటిని జాయింట్ కలెక్టర్ రద్దు చేశారు. అనంతరం ఈ భూములపై హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ కేసు విషయమై కలెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పూర్తి వివరాలతో తనకు నివేదిక పంపాలని ఆదేశించడంతో కలెక్టర్, జేసీ ఆకేపాటి ఎస్టేట్ పూర్తి వివరాలతో నివేదిక పంపించినట్లు తెలిసింది.

బ్రహ్మరథంపై విహరించిన లక్ష్మీనరసింహుడు

- గోవింద నామస్మరణతో మార్మోగిన తరిగొండ



బ్రహ్మరథంపై ఊరేగుతున్న స్వామి వారు



ప్రత్యేకాలంకారంలో స్వామి వారు

గుర్రంకొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తరిగొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మరథంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని బ్రహ్మరథంలో అధిష్ఠింపజేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బ్రహ్మరథంలో ఆశీనులైన స్వామి వారి రథాన్ని లాగడానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. భక్తుల గోవింద నామస్మరణతో తరిగొండ మార్మోగింది. స్వామి వారికి మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు చాందినీ బండ్లు, అన్నం బండ్లను అధికంగా కట్టారు. స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాదిగా భక్తులు వచ్చి కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాల్లో దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎస్వీ మ్యూజిక్ కళాశాల బృందం ఆధ్వర్యంలో గాత్ర కచ్చేరిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, గోపినాథ్, కృష్ణమూర్తి, వేద పండితులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, నరసింహులు, ధనుష్ వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

‘మీ-సేవ’ అయోమయం!

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించిన మీ-సేవా కేంద్రాల పునరుద్ధరణపై నిర్వాహకుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ ప్రకటించడంతో కొంత ఉపశమనం పొందారు. అయితే,వాట్సాప్ గవర్నెన్స్‌పేరుతో ఇటీవల చంద్రబాబు చేసిన ప్రకటన వారిని అయోమయంలోకి నెట్టింది.



- సచివాలయ వ్యవస్థతో నడ్డివిరిచిన జగన్
- రోడ్డునపడ్డ వేలాది కుటుంబాలు
- అమలుకు నోచుకోని నారా లోకేశ్ హామీ
- వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభంతో ఆందోళన

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంత వరకు ఓ వెలుగు వెలిగిన మీ-సేవాకేంద్రాలకు జగన్ రూపంలో ఉపద్రవం వచ్చిపడింది. మీ- సేవ కేంద్రాలు అందించే సర్వీసులను సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామంటూ మొదలుపెట్టి, నాలుగు రోజులు గడవకనే రుసుం వసూలు ప్రారంభించారు. మీ-సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రచారం చేయించారు. దీంతో జనం మీ-సేవ కేంద్రాలకు వెళ్లడం దాదాపుగా మానేశారు. దీంతో నిర్వహణ ఖర్చులు భరించలేక చాలా మంది మీ-సేవ కేంద్రాలను మూసివేయగా, కొందరు మంచిరోజులు మళ్లీ వస్తాయనే ఆశతో నెట్టుకొస్తున్నారు.

రోడ్డునపడ్డ కుటుంబాలు..

రాష్ట్రంలో 2019కి ముందు 11 వేలకు పైగా మీ-సేవ కేంద్రాలుండేవి. వీటి ద్వారా రెవెన్యూ, ఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర 36 శాఖలకు చెందిన 329 సర్వీసులు ప్రజలకు సకాలంలో అందేవి. ప్రభుత్వం నిర్దేశించిన రుసుములో కొంతభాగం కమిషన్ రూపంలో వీరికి దక్కేది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఒక్కొక్క టిగా ఈ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.



మీ సేవ నిర్వాహకుల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న నారాలోకేశ్ (ఫైల్‌ఫొటో)

వాట్సాప్ గవర్నెన్స్ ప్రకటనతో అయోమయం..

మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు విజయవాడలో చేస్తున్న ఆందోళనకు అప్పటి రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెంనాయుడుతో కలిసి నారాలోకేశ్ సంఘీభావం తెలపడమే కాకుండా, అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలకు ప్రాణం పోస్తానని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. టైం..డేట్ కూడా రాసిపెట్టుకోండని గట్టిగానే చెప్పారు. అయితే, ఇటీవల ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్ ప్రకటనతో మీ-సేవ నిర్వాహకుల గుండెల్లో రాయి పడింది. దాని విధివిధానాలు పూర్తిగా ఖరారు కాకపోయినా, తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

‘మీ-సేవ’ను ఆదుకోవాలి..

మీ-సేవ కేంద్రాలను ప్రభుత్వం ఆదుకోవాలి. లోకేశ్‌బాబు హామీని నిలుపుకోవా లి. రూము అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు చేతినుంచి వేసుకొని కేంద్రాలు నడుపుతు న్నాము. గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి మరీ దారుణంగా వుంది. ఇప్పటికే చాలా వరకు మూతపడ్డాయి. మమ్మల్ని ఆదుకోండి.

- రాజేష్ , బి.కొత్తకోట

ఆలయాల సంరక్షణ అత్యంత ఆవశ్యకం

- పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామి

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి):భారతదేశంలో ఆలయాలను కాపాడాల్సిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉందని పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామి అన్నారు. బుధవారం మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామం, చిట్టి అన్నవరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో సత్యదేవ సదన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భారతదేశంలో ఆధ్యాత్మిక చింతన తగ్గిపోతోందని, దీని పునరుద్ధరణకు ఆలయాల ఆలయాల సంరక్షణ అత్యవసరమన్నారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, అర్చనల్లో ఆయన పాల్గొన్నారు. సత్యదేవ సదన్‌లో అన్ని గదులు తిరిగి కర్పూరహారతులు అందించి, పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు సందేశం ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అంతకుముందే ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.


సత్యదేవ సదన్‌ను ప్రారంభిస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతీ స్వామి

కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు ఎ.అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కో ఆర్డినేటర్ శివశంకర్, జ్ఞానోదయ కామకోటి ప్రసాదరావు, రమణరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ వివాదం పరిష్కరించండి

- ఏపీఐఐసీ ఎండీని కోరిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ స్థల వివాదం పరిష్కరించాలని ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. బుధవారం విజయవాడలో ఏపీఐఐసీ కార్యాలయంలో ఎండీతో మాట్లాడుతూ ఆటోనగర్ లేక పోవ డంతో 20 ఏళ్లుగా మదనపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొ మ్మిదేళ కిందట వలసపల్లె వద్ద ఆటోనగర్‌కు స్థలం సేకరించినా, స్థల విషయం పై కొందరు కోర్టులో కేసు వేశారన్నా రు. తగిన రీతిలో నష్టపరిహారం ఇప్పిస్తే, రైతులు కేసు వాపసు తీసుకుంటారని, వివాదం సమసిపోతుందన్నారు. సమస్య పరిష్కారానికి ఏపీఐఐసీ ఎండీ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట యుగంధర్, గురుమూర్తి, సీతక్క తదితర రైతులు పాల్గొన్నారు.


ఏపీఐఐసీ ఎండీతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రైతులు

ఆస్తి పన్ను మినహాయింపు అమలు చేయాలని ఆందోళన

మదనపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఆస్తి పన్ను, నీటి పన్ను మినహాయింపును అమలు చేయాలంటూ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ సైనికులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీసైనికులకు పూర్తిస్థాయిలో ఆస్తిపన్ను, వాటర్ ట్యాక్సులో 20 శాతం మినహాయిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ఈ జీవోను అమలు చేయకపోగా, బకాయిలు చెల్లిస్తేనే, తర్వాత అమలు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కొత్తగా ఇల్లు నిర్మించిన, కొనుగోలు చేసిన వారి విషయంలో వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మున్సిపాలిటీకి, అక్కడి నుంచి ఉన్నతాధికారులకు పంపడంలో జాప్యం చేయడం, తదితర కారణాలతో సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఆర్‌ఓ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మాజీసైనికులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులు ఢీ : కండక్టర్ మృతి

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు లోని రాయల్పాడు సమీపంలో మంగళవారం సువర్ణముఖి ప్రైవేట్ బస్సును బెంగళూరుకు వెళుతున్న ఏఆర్ అండ్ బీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన కండక్టర్ గంగాధర్ బాబు(58) మృతి చెందారు. సుమారు 40 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో కొం దరిని మదనపల్లెలోని ప్రభు త్వ ఆస్పత్రికి తరలించగా మరికొంతమంది కర్ణాటకలోని చింతామణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ పోషకుడు మృతి చెందడంతో రోడ్డున పడ్డామని గంగాధర్‌బాబు భార్య మంజుల, కూ తుళ్లు అనూషా, శైలజ విలపించారు. రాయల్పాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గంగాధర్‌బాబు (ఫైల్‌ఫొటో)

కువైత్‌లో కోడూరు వాసి ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన కొల్ల శ్రీనివాసులు(38) కువైత్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనివాసులుకు నాలుగేళ్లు కువైత్‌లో ఉండి ఇటీవలే ఇంటికి వచ్చాడు. ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో ఇల్లు విక్రయించి, భార్య అన్నపూర్ణతో కలిసి మూడు నెలల క్రితం మళ్లీ కువైత్‌కు వెళ్లారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కువైత్‌లోని తన గదిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు భార్య అన్నపూర్ణ సమాచారం అందించిందని బంధువులు తెలిపారు. శ్రీనివాసులు కుమారులు బాలాజీ, రామ్‌చరణ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ అతని తల్లి పార్వతమ్మ సంరక్షణలో ఉన్నారు


శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)

ఆర్టీసీ బస్సులో కిలేడీలు

- మహిళ పర్సులోని బంగారు నగల అపహరణ

రాజంపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సులో నలుగురు కిలాడీలు ఓ మహిళకు చెందిన బంగారు నగలను అపహరించారు. నందలూరు మండలం కుంపిణీపురం బలిజపల్లెకు చెందిన చిన్నం సరస్వతి తన మనవడికి తిరుమలలో పుట్టువెంట్రుకలు తీయించేందుకు బుధవారం ఇంటిలో ఉన్న బంగారాన్ని హ్యాండ్‌బ్యాగులో ఉంచుకుని, అదే గ్రామానికి చెందిన గణపతి శారద అనే మహిళతో కలసి నందలూరు బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండులోని దుకాణం వద్ద బ్యాగును తెరవడం, బంగారు నగలను పక్కకు తీసి డబ్బు ఇవ్వడం బస్టాండులో ఉన్న నలుగురు మహిళలు గమనించారు. జమ్మలమడుగు - తిరుపతి బస్సులో ఎక్కిన సరస్వతి, శారదలను అను సరించారు. టిక్కెట్ కొనుగోలుకు పర్సు తెరచిన సమయంలో ఒక రు ఆమె సాయం చేస్తున్నట్లు నటించగా, మిగతా ముగ్గురు ఆమెపై పడి పోయారు. ఆ సమయంలో చాకచక్యంగా పర్సులో ఉన్న బం గారు నగలు దొంగలించారు. బోయనపలె రాగానే బస్సు దిగి వెళ్లిపోయారు. అనంతరం పర్సు గమనించిన సరస్వతి బస్సు డ్రైవర్, కండక్టర్లకు విషయం తెలపడంతో మన్నూరు పోలీసుస్టేషన్ వద్ద బస్సు ఆపి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ మహ్మద్‌అలీ నలుగురు కిలాడీ లేడీలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు.

గుట్టలో దొరికిన చిన్నారి రాయచోటికి తరలింపు

ములకలచెరువు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుట్టలో దొరికిన చిన్నారిని ఐసీడీఎస్ అధికారులు మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. స్థానిక ఉమాశంకర్ కాలనీ సమీపంలోని జనసంచారం లేని గుట్టలో చిన్నారిని సుమియా అనే మహిళ అక్కున చేర్చుకున్న విష యం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారిని పోలీసుల పర్యవేక్షణ మధ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించారు. అనంతరం రాయచోటి శిశు సంరక్షణ కేంద్రంలో అప్పగించారు.


బిడ్డను అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

హత్య కేసులో నిందితుల అరెస్టు

సంబేపల్లె, మార్చి12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పనులకోసమే వారాది అనే వ్యక్తిని హత్య చేసినట్లు రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మార్చి రెండున ముద్దినేనివాండ్లపల్లె సమీపంలోని మల్లూరమ్మ గుడి వద్ద సిమెంటుకు కాపలా కాస్తున్న వారాది అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. కల్వర్టు నిర్మాణం కాంట్రాక్టు పని తనకు వచ్చిందని, సిమెంటు రోడ్డు పనులు కూడా తానే చేస్తానని వారాది గ్రామంలో చెబుతుండడంతో జీర్ణించుకోలేక బెల్లం యోగానందరెడ్డి అనే వ్యక్తి చిన్నికృష్ణ సాయంతో సిమెంటుకు కాపలా కాస్తూ నిద్రపోతున్న వారాదిపై బండరాయితో దాడి చేసి చంపినట్లు తెలిపారు.

అవినీతి కేసులో ‘రిజిస్ట్రేషన్’ సిబ్బంది ఇంక్రిమెంట్లలో కోత

కలికిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కడప అర్బన్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 2019లో పనిచేసిన ఏడుగురు సిబ్బందికి క్యుములేటివ్ ప్రాతిపదికన మూడేసి ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2017 జూలై 12న అర్బన్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు దండు వెంకట సుబ్బా రెడ్డి, ఆవుల రంగనాథబాబు, స్టాంపుల డిపో జూనియర్ అసిస్టెంట్లు ఎనమల వెంకట్రమణ, కడిమెల్ల రెడ్డెయ్యరాజు, షరాఫ్ షేక్ మస్తాన్‌వలీ, ఆఫీస్ సబార్డినేట్‌లు కోకల శ్రీనివాసులు, కోలా సుబ్బలక్ష్మమ్మ వద్ద అవినీతికి సంబంధించిన ఆధారాలు లభించడంతో ఏడుగురిపైన కేసు నమోదు చేశారు. దీనిపై సంజాయిషీ నోటీసులు జారీ చేసి పలుమార్లు విచారణ చేసిన అనంతరం, ఈ వ్యవహారాన్ని కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌కు అప్పగించారు. ఏడుగురినీ కలిపి ఒకే కేసుగా పరిగణించి కేసును కొనసాగించారు. రిటైర్డు ఐపీఎస్ అధికారి ఆర్.పి. ఠాకూర్ ఆధ్వర్యంలో ఏర్పడిన విచారణ కమిషను కేసును కూలంకషంగా విచారించి అందరినీ దోషులుగా నిర్ధారించింది. ఆధారాలతో సహా కేసు నిరూపణ జరిగింది. చివరగా ఏడుగురి నుంచి కడప స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల డీఐజీ చివరి సంజాయిషీలు తీసుకుని ఈ నెల 2న ప్రభుత్వానికి అందజేశారు. పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం ఏడుగురికీ క్యుములేటివ్ పద్ధతిలో మూడేసి ఇంక్రిమెంట్లు కోత విధించింది. ఆ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ శిశోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కంది రైతులు సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి

రామాపురం, మార్చి12(ఆంధ్రజ్యోతి): కంది పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలంటే సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని చిట్లూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మార్కెట్ యార్డులోని కందులు కొనుగోలు కేంద్రంలో కందులు క్వింటాల్ ధర రూ.7,550 కనీస మద్దతు ధర ఇస్తారని రైతులకు తెలియజేశారు. సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు మాత్రమే వ్యవసాయ అనుబంధ శాఖల నుండి లభించే పథకాలకు అర్హులని తెలిపారు. వేరుశనగలో జిప్సం ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పంటల బీమా ప్రయోజనాలు వివరించారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేసిన పంట వివరాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19 లోపు రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి వై. నాగమణి, ఏఈవో ప్రసంజిని, వీహెచ్ఏ యాసిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

సమగ్ర యాజమాన్యంతో పూత, పిందెకు రక్షణ

పీలేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో మామిడి పూత, పిందెను కాపాడుకోవచ్చని కలికిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సమీకృత ఉద్యాన మిషన్‌లో భాగంగా బుధవారం పీలేరు మండలం కాకులారం పల్లె పంచాయతీ కోళ్లపారం, బాలంవారిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లెల్లో మామిడి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పిందె, పూతను తేనె మంచు పురుగు, తామర పురుగు, ఆంత్రాక్నోస్ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు బుప్రోఫ్యుజిన్ 20%, అసిఫేట్ 50%, పైమెట్రోజన్, సాఫ్, థయోఫినైట్ మిథైల్ తగు మోతాదుల్లో వాడాలన్నారు. పిందెలు రాలుతున్నట్లు అనిపిస్తే ప్లానోఫిక్స్ అనే మందును 4.5 లీటర్ల నీటికి 1 మిల్లీలీటరు కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులందరూ ఫ్రూట్ కవర్లు కట్టుకోవాలని సూచించారు. కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల పండు ఈగ, మసి మంగు నుంచి కాయకు రక్షణ ఉంటుందన్నారు. కవర్లు కట్టిన కాయలన్నీ ఒకే సైజులో, మంచి నాణ్యతతో ఉంటాయన్నారు. దూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నప్పుడు కాయలు త్వరగా చెడిపోకుండా ఉంటాయన్నారు. అధిక గాలి వచ్చినప్పుడు కాయలు రాలకుండా కవర్లు రక్షణ కల్పిస్తాయని, ఎటువంటి రసాయన అవశేషాలు లేనందు వల్ల కవర్లు కట్టిన కాయలకు మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓ సుకుమార్ రెడ్డి, ఏఓ రమదేవి, రైతులు రమణ, షౌకత్‌అలీ, సురేంద్రనాథరెడ్డి, ఏఈవోలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


కాకులారంపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి

- మూడు జిల్లాల్లో 19మందికి అవకాశం

మదనపల్లె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 19 మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లా కలెక్టర్, నోడల్ ఆఫీసర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని మండలాలు, జిల్లా కేంద్రాల్లో సీనియర్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులుగా పని చేస్తున్నారు. పదోన్నతి పొందిన వారిలో కె.మాధవి(తిరుపతి కలెక్టరేట్), డి.రాజశేఖర్(చిత్తూరు కలెక్టరేట్), టి.బాలాజీ(పెద్దతిప్పసముద్రం), ఆర్.మోహన్(చిత్తూరు డీఎస్‌వో కార్యాలయం), పి.చాణక్య(అన్నమయ్య డీఎస్‌వో కార్యాలయం), బి.నందినీదేవి(పలమనేరు), వి.రేఖ(చిత్తూరు కలెక్టరేట్), జి.కృష్ణమ్మ(ఆర్.సి.పురం), జి.మస్తాన్‌కమలాకర్(అన్నమయ్య కలెక్టరేట్), ఎస్.అనీష(ములకలచెరువు), బి.జోసెఫ్(చిత్తూరు కలెక్టరేట్), ఎం.శిరీష(చిత్తూరు డీఎస్‌వో కార్యాలయం), బి.సుధాకర్‌నాయక్(రొంపిచెర్ల), బి.భాస్కర్(చంద్రగిరి), ఎం.నరేంద్ర(గంగవరం), పి.శోభ(చిత్తూరు కలెక్టరేట్), బి.నాగరాజు(తొట్టంబేడు), ఆర్.మధుసూదన్(బంగారుపాళెం), జి.యోగేష్(చిత్తూరుకలెక్టరేట్)ఉన్నారు. వీరికి జిల్లాలు కేటాయించిన అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లు.. కేంద్రాలు, మండలాల వారీగా పోస్టింగ్ ఇవ్వనున్నారు.

మార్కెట్ వేలం వాయిదా

కమలాపురం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన దినసరి మార్కెట్ , బస్టాండు, జంతు వధశాలల్లో రుసుము వసూలు హక్కుల వేలంలో ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేసినట్లు నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ఈ వేలంను 18వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన వివరించారు.

కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు భరోసా..

- టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని
- మెగా జాబ్‌మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు

రైల్వేకోడూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మెగా జాబ్ మేళానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసినప్పుడు రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఉద్యోగాలు లేక, గల్ఫ్ కు వెళుతున్నారని వివరిచడంతో ఆయన స్పందించి అమరరాజా, మోటరోలా, అపోలో సంస్థల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించ వచ్చునని తెలపడంతో ఆయా సంస్థలతో కలసి మాట్లాడి మెగా జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవనకళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగార్జునరావు, తెలుగు యువత సీనియర్ నాయకుడు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, మల్లెం హేమంత్, చాపలమడుగు సూర్యప్రకాష్ చౌదరి, కస్తూరి దినేష్, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు దక్కించుకున్న యువతతో పంతగాని, ఆయా సంస్థల ప్రతినిధులు

మహిళపై చిత్రహింసలు..నలుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఆమె భర్తతోపాటు, మరో ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీకి చెందిన టి. సంఘవికి పదేళ్ల క్రితం కలికిరి మండలం గుట్టపాలెంకు చెందిన వెంకటరమణతో వివాహం జరిగింది. అయితే వీరికి ఇద్దరు కుమారులు. కాగా వెంకటరమణ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని సంఘవిని చిత్రహింసలకు గురిచేసేవాడు. అతని తల్లి రమణమ్మ(51),చెల్లి శివమ్మ(38) తమ్ముడు మనోహర(32) కూడా చిత్రహింసలు పెట్టేవారు, ఈ విషయంలో గతంలో కూడా కలికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రాజీ కుదిర్చినట్లు తెలిపారు. అయినా వారు మారకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ సెస్సు వేలంతో అంగళ్లు పంచాయతీకి రూ.1.05 కోట్ల ఆదాయం

కురబలకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతల్లో సెస్సు వసూలు హక్కులకు నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి ఆదాయం దక్కింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతలకు వేలం నిర్వహించగా, అంగళ్లుకు చెందిన పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి. టమోటా మార్కెట్‌ను రూ.45.40 లక్షలకు, మదనపల్లెకు చెందిన సత్తార్‌ఖాన్ గొర్రెల సంతను రూ.52.10 లక్షలకు, యు.శ్రీనివాసులు వారపు సంతను రూ.7.70 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, డీఎల్‌డీవో నాగరాజ, ఎంపీడీవో గంగయ్య,ఈవోపీఆర్‌డీ అశ్విని, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లోని గదుల వేలానికి దేవదాయశాఖ అధికారుల కసరత్తు

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఉన్న దేవదాయశాఖ ఆధ్వర్యంలో గదుల వేలానికి సాధ్యాసాధ్యాలను జిల్లా దేవదాయ శాఖ అధికారులు బుధవారం అధ్యయనం చేశారు. కొండ మీద అతిపురాతనమైన ఏనుగుమల్లమ్మ ఆలయం వుంది. కోటావూరు పంచాయతీ పరిధిలోని పలుగ్రామాల ప్రజలు ప్రతియేటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయం ముందుభాగంలో ఉన్న గదులను బహిరంగ వేలం ఎందుకు వేయలేదంటూ దేవదాయశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్‌కు మెమో ఇచ్చారు. దీంతో ఆయన జిల్లా టూరిజం అధికారి నాగభూషణంతో కలిసి బుధవారం హార్సిలీహిల్స్‌కు చేరుకొని వేలం వేయదలచిన గదులను పరిశీలించారు. ఏనుగు మల్లమ్మ ఆలయానికి చట్టబద్ధంగా 0.40 ఎకరాల భూమి మాత్రమే వుందని, ప్రస్తుతానికి టూరిజం అధికారుల సహ కారంతో గదులను వాడుకోవడంతో పాటు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నామని ఆలయ ధర్మకర్త రాజేంద్రనాథ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి ఎండోమెంట్ అధికారులకు వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, తదుపరి ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుందని ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.

భూఆధార్

వ్యవసాయ రంగంలో అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు అర్హులకు మాత్రమే అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా నిజమైన లబ్ధిదారులకు మేలు జరిగేలా వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు యూనిక్ కార్డును జారీ చేస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఫార్మర్ రిజిస్ట్రి పేరిట జిల్లాలో చేపడుతున్నారు.

- రైతన్నల సంక్షేమం కోసం..
- 14 అంకెలతో ప్రత్యేక కార్డు జారీ
- పథకాలు, ప్రోత్సాహాల లబ్ధికి కీలకం
- పట్టా భూములకే ప్రయోజనం
- ఆందోళనలో పేదరైతాంగం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభు త్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డులు జారీ చేస్తోంది. ఇది కేంద్రంలోని వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్ కార్డును జారీ చేస్తారు. ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉప యోగపడుతుంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పేర్ల నమోదు చేపట్టడం ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి దేశ వ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మంది రైతులకు భూఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

జిల్లాలో మొత్తం 2,40,672 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 97,646 మంది రైతుల వివరాలు నమోదు చేశారు. ఇంకా 1,43,026 మందికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ నమోదు కొనసాగుతూనే ఉంది. ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు అవుతున్న పథకాలు, రాయితీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. సొంతభూమి ఉన్న రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నెంబర్ లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉన్న ఫోన్ తీసు కెళ్లాలి. రైతు సమక్షంలోనే రైతు సేవా కేంద్ర సిబ్బంది నిర్దిష్ట పోర్టల్‌లో రైతు భూమి వివరాలు ఆధార్‌కార్డు ఫంక్షన్ నెంబర్ నమోదు చేస్తారు. నమోదు పూర్తికాగా నే రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని రైతు సేవ కేంద్రం సిబ్బందికి తెలియజేస్తే నమోదు ప్రక్రియ పూర్తయి రైతు లకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుంది.

యూనిక్‌కార్డుతో లాభాలు

ప్రస్తుతం జారీ చేస్తున్న యూనిక్ కార్డుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రాయితీలు, అనేక సంక్షేమ పథకాలు ఈ కార్డు ద్వారా అందజే స్తారని వివరిస్తున్నారు. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీ భవ, పంటల బీమా, వ్యవసాయ పరికరాల రాయితీలు, పంట పెట్టుబడి, ఎరువుల రాయితీలు, కనీస మద్దతు ధర పంట రుణా లు పొందే ప్రక్రియను ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య మరింత సులభ తరం చేయనుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటు న్నారు. మరి కొంతకాలం తర్వాత ఉద్యాన రైతులు వివరాలను కూడా సేకరించి అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులో కౌలు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, వ్యవసాయ అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి వివరాలను కూడా సేకరించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సొంత భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తమకు సంబంధించిన రైతుసేవ కేంద్రంలో వివరాలను నమోదు చేయించుకోవాలి. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి చేకూరే లబ్ధి ఈ సంఖ్య ఉంటేనే అమలయ్యే పరిస్థితి ఉంటుంది.

- నరసింహారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ

పట్టా భూములకేనా... ప్రయోజనం

ప్రస్తుత వ్యవసాయశాఖ చేపడుతున్న విశిష్ట గుర్తింపు సంఖ్య సొంత భూముల రైతులకే కేటాయిస్తుండడంపై మిగిలిన రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా ప్రభు త్వాలు పంపిణీ చేసిన డీకేటీ భూములకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం వెల్లడి కాకపోవడంతో పేద రైతాంగం నిరాశలో ఉన్నారు. సొంత భూమి ఉన్న రైతులకే పేర్ల నమోదు కార్డుల జారీకి సుదీర్ఘకాలం పట్టే అవకా శాలు కనిపి స్తున్నాయి. తమ వరకు వచ్చేటప్పటికి ఏ నిబంధనలతో నమోదు కార్యక్ర మాన్ని చేపడుతారో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే రెవెన్యూశాఖ నుంచి ముందుగా వివరాలు సేకరించిన తర్వాతనే డీకేటీ భూములకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



రైతు సేవా కేంద్రంలో వివరాలను నమోదు చేస్తున్న దృశ్యం

బాధితులకు సత్వరం న్యాయం చేయాలి



రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాజుపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏదైనా సమస్యపై పోలీసుస్టేషనుకు బాధితులు వచ్చినప్పుడు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాజుపాలెం పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న సమస్య అయినా ఫిర్యాదు చేస్తే పెండింగు లేకుండా సత్వరం పరిష్కారం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కువగా రైతులకు పొలం గట్లు, భూసమస్యలుంటాయని, అవి ఎలాంటి పరిణామాలకైనా దారితీస్తాయని.. వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తొండలదిన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఎస్పీ అశోక్‌కుమార్ తన స్నేహితుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండడంతో.. అతని కోరిక మేరకు అక్కడికి వెళ్లి విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ కత్తి వెంకటరమణ పాల్గొన్నారు.

250 బస్తాల చౌక బియ్యం స్వాధీనం



పట్టుబడ్డ బియ్యం బస్తాలతో సీఐ పురుషోత్తంరాజు


చెన్నూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం 250 బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తోళ్లగంగనపల్లె రోడ్డు సమీపంలో ఓ రేకులషెడ్డులో నిల్వ ఉంచిన 150 బస్తాలు, గోపవరం సమీపంలోని కేసీ ప్రధాన కాల్వ సమీపంలో నిల్వ ఉంచిన వంద బస్తాలను సీఐ పురు షోత్తంరాజు ఆధ్వర్యంలో పట్టుకుని బాబయ్య అనే వ్యక్తిని అరెస్టు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని డీటీ ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ స్టాకు పాయింటుకు తరలించారు. పోలీసు సిబ్బంది పుష్పరాజు, శ్రీనివాసరాజు, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకటుబ్బయ్య పాల్గొన్నారు.

వన్యమృగాల వేటగాళ్లపై వేటు

- 14 రోజుల రిమాండ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వన్యమృగాలను వేటాడి వాటి మాంసపు విక్రయాల ద్వారా సొమ్ము చేసుకుంటున్న వేటగాళ్లపై అటవీఅధికారులు ఈనెల 10వ తేదీ దాడి చేసి పట్టుకున్నారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. చింతకొమ్మదిన్నె మండలం ఎగువసుగాలిబిడికి సమీపంలో ఉన్న రజనిగారి తోటలో కొంతమంది వ్యక్తులు దుప్పిని కోస్తున్నారనే సమాచారం అటవీశాఖ అధికారులకు అందింది. దీంతో డీఎఫ్ఓ ఆదేశాల మేరకు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ షకీల్ అహ్మద్, బీట్ ఆఫీసర్లు చౌడయ్య, నందిని, బాష తదితరులు దాడి చేసినట్లు వివరించారు. అటవీ సిబ్బంది దాడి చేసిన సమయంలో చింతకొమ్మదిన్నె మండలం కొలములపల్లెకి చెందిన పొట్టిపాటి రాజశేఖరరెడ్డి, బుడుగు గంగయ్యతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ముదిరెడ్డి హరిలు దుప్పి మాంసం కోస్తూ దొరికినట్లు ఎఫ్ఆర్ఓ వివరించారు. దీనితో వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న నాలుగు కిలోల దుప్పి మాంసం, దుప్పి చర్మం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ టీడీపీ నేత మృతి



గంగిరెడ్డి (ఫైల్ ఫొటో)

పెండ్లిమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నేత, చీమల పెంట గ్రామానికి చెందిన మండ్లి గంగిరెడ్డి బుధవారం మృతి చెందాడు. ఈనెల 2వ తేదీ నందిమండలం గ్రామం నుంచి చీమలపెంటలోని తన ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రావులపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

ఖాజీపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడని రావులపల్లి సర్పంచ్ పి.శివరామిరెడ్డి చెక్‌పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి రద్దు చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. గతంలో సర్పంచ్ అభివృద్ధి చేయకపోయినా నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్తులు, వార్డు మెంబర్లు ఫిర్యాదు మేరకు విచారణ చేశారని, ఆ నిధులు దుర్వినియోగానికి సహకరించిన కార్యదర్శులు శ్రీనివాసులు, నారాయణరెడ్డిలకు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యం సులభతరం

వేంపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సులభతరం అవుతుందని వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులనుద్దేశించి వ్యక్తిగత విద్యా సామర్థ్యాలను పెంపొందించుకోవడం అనే అంశంపై అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మనిషి సంఘజీవిగా చేయాల్సిన పనులను ముందుగా ఆలోచించి వాటిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో నిలవాలి

- స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్



మాట్లాడుతున్న స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్య పరిశోధన ప్రమాణాలకు నెలవైన యోగివేమన విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ ఆకాంక్షించారు. బుధవారం వైవీయూ 19వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో అతిథుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ సాధించాలనే తపన, సంకల్పబలం ఉన్నవారే విజేతల జాబితాలో నిలుస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. దాని సాధనకోసం నిరంతరం శ్రమించాలన్నారు. చరిత్రలో మీకో పేజీ ఉండేలా మీ ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్య పరిశోధనలో విశ్వవిద్యాలయం అద్భుతమైన ప్రగతిని సాధించిందన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడారు. అనంతరం వైవీయూ ఉపకులపతి ఆచార్య పి.ప్రకాష్ బాబు పంపిన సందేశాన్ని చదవి వినిపించారు. అనంతరం ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఆర్మీ రిక్రూటింగ్ గుంటూరు బ్రాంచ్ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేవోఐఎన్ఐఎన్‌డీఐఎన్ఏఆర్ఎంవై.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు అగ్నివీర్ విభాగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని.. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీఈఈ) తొలిసారిగా తెలుగు సహా 13 వేర్వేరు భాషల్లో జరుగుతుందని వెల్లడించారు. అన్ని కేటిగిరీలకు ఎన్‌సీసీ ఏ,బీ,సీ సర్టిఫికెట్ కలిగిన, ప్రతిభావంతులైన క్రీడాకారులు, టెక్నికల్ కేటిగిరీ పోస్టుల కోసం ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇస్తారని తెలిపారు.

ఏఎఫ్ఏయూలో 1,3 సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదలచేస్తున్న వీసీ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీలో బుధవారం ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి 1,3 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్, రిజిస్ట్రార్ రాజజేష్‌కుమార్ రెడ్డి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో ఫలితాలు విడుదల చేసేందుకు కృషిచేసిన సిబ్బందిని అభినందించారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి జి.ఫణీంద్ర రెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణ అధికారి ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి, నారపురెడ్డి, పీఆర్‌సెల్ అధికారి వి.శివకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకులు 30 శాతం రక్తం పేదలకు ఇవ్వాలి



రెడ్‌క్రాస్‌లో రిజిష్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కడప కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్ర జ్యో తి): రక్తదాన శిబిరాలు ఎక్కువగా నిర్వహించి... బ్లడ్ బ్యాంకుల నుంచి 30 శాతం రక్తం పేదలకు అందజేయాలని లేకపోతే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు ఆదేశించారు. బుధవారం నగరంలోని బ్లడ్ బ్యాంకులను జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ సగిలి రవిబాబుతో కలిసి రెడ్‌క్రాస్ సెంటర్‌తో పాటు బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు. అక్కడున్న రిజిష్టర్లను పరిశీలించారు. రక్తం అవసరం ఉన్న వారి వద్ద ఎంత డబ్బు వసూలు చేస్తున్నారనే విషయాలను రోగులకు ఫోన్ చేసి ఆరా తీశారు. అలాగే రక్తదాత రికార్డు, క్యాంపు రిజిష్టర్స్ తదితరాలను పరిశీలించారు. ఏపీ సాక్స్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు ఆలీహైదర్, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నివారణ

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని డీఎం హెచ్‌వో డాక్టర్ నాగరాజు, స్టేట్ అబ్జ ర్వర్ పార్వతీశం అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో రాయలసీమ జిల్లాలకు సంబంధించిన సబ్ యూనిట్ మలేరియా అధికారులతో ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాలు మొక్కుబడిగా చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో మండలస్థాయి అధికారులతో మమే కమై పారిశుధ్య కార్యక్రమంపై చైతన్యం కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారిణి మనో రమ, డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనాయక్, డాక్టర్ నాగసుధారాణి, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పొలతల ఆలయ శాశ్వత హుండీల ఆదాయం రూ.33,37,829

పెండ్లిమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామి ఆలయ శాశ్వత హుండీల ద్వారా రూ.33,37,829 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. బంగారు 50 గ్రాములు, వెండి 4 కేజీలు వచ్చాయన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ సూప రిండెంట్ రమణమ్మ, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పెనగలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : టీవీ సెలబ్రిటీ హనీ పుట్టినరోజు సందర్భంగా పెనగలూరు, మూగవారిపల్లె దళితవాడలకు చెందిన ఆమె అభిమానులు బుధవారం అంగన్వాడీ చిన్నారులు, కార్యకర్తలకు సి.భాగ్యమ్మ, కె.కన్నమ్మల ఆధ్వర్యంలో బ్యాగులు, పలకలు, బలపాలు, ప్లేట్లు వితరణ చేశారు. వెంకీ, తేజ, రత్నాలు, దినేష్, హరి, గణేష్, ప్రవీణ్. వేణు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హజరత్ దర్బార్ అలీషా వలి ఉరుసు

రామాపురం, మార్చి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సమీపంలోని సద్గురు సాయి దర్బార్ నగర్‌లో వెలిసిన హజరత్ దర్బార్‌అలీషా వలి రహంతుల్లా అలైబాబా జలీల్ మస్తాన్‌వల్లి బాగా ఉరుసు ఉత్సవాలు నేటి నుంచి జరగనున్నాయి. ఈ నెల 13న గంధం, 14న ఉరుసు ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రికి జెండా మెరమణి, ఖవ్వాలి ఉంటుందన్నారు. 15న తీర్థప్రసాదాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. బందోబస్తు ఏర్పాటు చేసినట్లు లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

సుండుపల్లె, మార్చి12(ఆంధ్రజ్యోతి): నాబార్డు ద్వారా రైతులు నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని నాబార్డు రీసోర్స్‌పర్సన్ (ఏపీఆర్‌వో) రేఖ గోనెల్, కడప డీడీఎం విజయ విహారీలు సూచించారు. బుధవారం మా తోట ప్రాజెక్టు పరిశీలనకు నాబార్డ్ ప్రతినిధులు హాజరై ఎగువసుగాలిబిడికి, వానరాచపల్లిలో టీ ప్రాజెక్టు కింద నాటిన మొక్కలను, పనులను, బోరు మోటారులను పరిశీలించారు.

నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టి నేడు 'పోరు' సిగ్గుచేటు

● వైసీపీ ఫీజు పోరుపై టీడీపీ నేతల ఆగ్రహం

రాయచోటిటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా ఇవ్వకుండా ఎగ్గొట్టి నేడు ఫీజు పోరు చేయడం సిగ్గుచేటని టీడీపీ నేతలు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, జాబీర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించలేని జగన్ ఇప్పుడు నిరసనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్లలో గుర్తుకు రాని ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనలు జగన్‌కు ప్రతిపక్షంలో ఉండగా గుర్తొచ్చిందా అని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తే జగన్‌రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మందికే అది కూడా విడతల వారీగా ఇచ్చి దాదాపు ఏడు లక్షల మంది పేద విద్యార్థులను మోసం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2832 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989 కోట్లు, పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.450 కోట్ల బకాయిల కుప్ప పెట్టి అందిన కాడికి దోచుకుని బెంగుళూరు ప్యాలెస్‌లో కూర్చుని నీచరాజకీయాలు నడుపుతున్న వైసీపీ దొంగల ముఠా నాయకుడు జగన్‌రెడ్డి బకాయిల గురించి సమాధానం చెప్పాలని వారు ప్రశ్నించారు. 2024 జనవరిలో విడుదల చేయాల్సిన బకాయిలను జగన్ ఇవ్వకుండా ఎగ్గొడితే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆ బకాయిలను విడుదల చేస్తున్నారన్నారు.



మట్లాడుతున్న టీడీపీ నేత మదన్‌మోహన్‌రెడ్డి, పాల్గొన్న అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండా భాస్కర్‌రెడ్డి, తదితరులు

జాతీయ హైవేపై రెండు లారీలు ఢీ - డ్రైవర్లకు గాయాలు

ఓబులవారిపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి ముక్కావారిపల్లె పరిధిలో 2 లారీలు ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఇరు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఎంహెచ్ 43సిఈ 6413 నంబరు గల కంటైన్ వాహనం డ్రైవర్ ప్రతాప్‌గౌడ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. కర్ణాటకకు చెందిన మరో వాహన చోదకుడు పరమేశ్ కాలికి స్వల్ప గాయాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్‌ను బయటకు లాగేందుకు సుమారు గంట సమయం పట్టడంతో హైవేకి ఇరువైపులా భారీగా ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ప్రమాదం జరిగిన వెంటనే ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్ సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి వాహనాలు వెళ్లేలా చేశారు. గాయపడినవారికి ముక్కావారిపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఒకరికి 108 ద్వారా మరొకరిని రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది. ప్రజలు లారీలను తొలగించేందుకు సహకరించారు.



డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

నిధుల దుర్వినియోగంపై విచారణ

● రోడ్డు వేయకుండానే బిల్లులు: డీఎల్‌డీవో



రోడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌డీఏ నరసింహమూర్తి

సుండుపల్లె, మార్చి12(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగంపై చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం డీఎల్‌డీవో నరసింహమూర్తి విచారణ నిర్వహించారు. అదే గ్రామ పంచాయతీకి చెందిన రెడ్డిమల్లప్పనాయుడు ఫిర్యాదుపై అధికారులు విచారణకు ఆదేశించడంతో విచారణ నిర్వహించినట్లు డీఎల్‌డీవో నరసింహమూర్తి తెలియజేశారు. గ్రామ పంచాయతీలోని అప్పయ్యగారిపల్లెలో రూ.1,74,420 సరెడ్డిగారిపల్లెలో రూ.1,73,695 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు తేలిందన్నారు. అప్పయ్యగారిపల్లెలో రోడ్డు వేయకుండా నిధుల దుర్వినియోగం అయ్యాయన్నారు. రికవరీ చేయి స్తామని విచారణకు వచ్చిన అధికారులకు సర్పంచ్ రామాజయచంద్ర చెప్పినట్లు స్థానికులు తెలిపారు. లక్షలాది రూపాయల గ్రామ పంచాయతీ అభివృద్ధి పక్కదారి పట్టాయని కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, ఖదీర్‌బాషా, సచివాలయ ఉద్యోగులు స్థానికులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆడపిల్లను రక్షిద్దాం.. చదివిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రైల్వేకోడూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను రక్షిద్దాం, చదివిద్దాం అని రైల్వేకోడూరులో ఐసీడీఎస్ ఏసీడీపీవో సరళాదేవి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే చట్టాలు కఠినంగా ఉంటాయన్నారు. సూపర్‌వైజర్లు ప్రవళ్లిక, యశోద, ఎస్. వెంకటరత్నమ్మ, ఏ. సుబ్బలక్షుమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సంఘాల లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలి

వీరబల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): సంఘాల లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. బుధవారం గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.20 లక్షల వరకు రుణాలు లభిస్తున్నాయని, ప్రతి నెలా సక్రమంగా చెల్లిస్తేనే వడ్డీ రాయితీ ఉంటుందని, కావున అన్ని సంఘాలు సమావేశాల్లో జరిగిన లావాదేవీల పుస్తకాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. వీవోఏ విజయమ్మ, సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి రాధిక పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో పంట నమోదు వివరాలు

పెనగలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఈ రబీ సీజన్‌కుగాను ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను రైతు సేవా కేంద్రంలోని నోటీసుబోర్డులో పెట్టినట్లు ఏవో సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చిన్నయ్యగారిపల్లె పరిధిలోని వరిపంట పొలాలను సందర్శించారు. పొట్ట, వెన్ను దశలో ఉన్న వరిని పరిశీలించి రైతులకు జాగ్రత్తలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

పెనగలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ఉన్నత పాఠశాలలో బుధవారం హెడ్మాస్టర్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రణవి, ఉపాధ్యాయులు మహేష్‌నాయుడు, ఎల్లయ్య, వెంకటసుబ్బయ్య, రహంతుల్లా పాల్గొన్నారు.

విద్యార్థుల తరలింపు తగదు



ఎంఈవోతో మాట్లాడుతున్న రాజానాయుడు

సిద్దవటం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మోడల్‌స్కూల్ పేరుతో విద్యార్థులను తరలించడం తగదని రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు రాజానాయుడు తెలిపారు. సిద్దవటం ఎమ్మార్సీ కార్యాలయంలో కమ్మపాలెం ప్రాథమిక పాఠశాల మోడల్ స్కూల్ పేరుతో 3, 4, 5 తరగతుల విద్యార్థులను జంగాలపల్లె ప్రాథమిక పాఠశాలకు బదలాయింపు తగదని ఎంఈవో సుజాత దృష్టికి బుధవారం తీసుకెళ్లారు.

ఉజ్వల భవిష్యత్ అందుకోవాలి



మాట్లాడుతున్న శివశంకర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్ అందుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ సందదర్భంగా నృత్య ప్రదర్శనలు అలరించాయి.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రైల్వేకోడూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌ఎంఎం హైస్కూలులో బుధవారం 92 మంది విద్యార్థులకు పుస్తకాలను నేత్రా ఫౌండేషన్ అధినేత చాపల నేతాజి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఏ. కోదండనాయుడు, డి. సుందర్‌బాబు మాట్లాడారు. ఏపీఆర్‌జేసీ, ట్రిపుల్‌ఐటీ ప్రవేశం పొందిన ముగ్గురికి ప్రత్యేక పురస్కారాలు అందిస్తామని నేతాజీ తెలిపారు. హెచ్‌ఎంఎం హైస్కూలు కరస్పాండెంట్ దేవసుందరం, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కడప - రేణిగుంట పనులు పూర్తి చేయండి

నందలూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీ రాజ్యసభలో కేంద్ర రోడ్డు రవాణా హైవే మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఎంపీ రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, కడప - రేణిగుంట జాతీయ రహదారి ఎన్‌హెచ్ 716 మంజూరై 2 సంవత్సరాలు అయినా ఇంకా పనులు ప్రారంభించలేదని, ఆ పనులను మొదలు పెట్టాలని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ కడప - రేణిగుంట జాతీయ రహదారిపై స్టేజ్-1 ఫారెస్ట్ క్లియరెన్స్ లభించిందని అటవీ (ఫారెస్ట్) నుంచి అనుమతులు వచ్చాయని తెలిపారు. కానీ వన్యప్రాణులు/ఎకో సెన్సిటివ్‌జోన్(ఈఎస్‌జెడ్) అభివృద్ధికి అనుమతి అవసరం, ఇంకా అనుమతులు రాలేదు వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టును రెండు ప్యాకేజీలు, రాయతీ ఒప్పందాలలో అమలు చేయాలని ప్రతిపాదించబడిందని అన్నారు. రెండు ప్యాకేజీలు అంటే కడప - చిన్నఓరంపాడు, చిన్నఓరంపాడు - రేణిగుంట సెక్షన్ నాలుగు లైన్ల ఎన్‌హెచ్-716 ఈ యేడాది జనవరి నెల 28వ తేదీన రాయితీ దారులతో సంతకం చేయబడిందని తెలియజేశారు.

కారు ఢీకొని పాదయాత్రికుడు దుర్మరణం

పుల్లంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తిరుమలకు పాదయాత్రగా వెళుతూ కారు ఢీకొనడంతో పాద యాత్రికుడు మృతి చెందిన సంఘటన బుధవారం పుల్లంపేట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వీరపునాయునిపల్లె మండలం అనిమల గ్రామానికి చెందిన కొందరు తిరుమల పాదయాత్రకు బయలుదేరారు. రెడ్డిపల్లె చెరువు కట్ట వద్దకు రాగానే రైల్వేకోడూరుకు చెందిన కారు పాదయాత్రికుని పైకి దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో చాట్ల కొండయ్య(42) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మల్లెల వెంకటేశంను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

లక్కిరెడ్డిపల్లె, మార్చి12(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని రాయచోటి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్రలు పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె సీపీఐ కార్యాలయం ఎదుట మహిళలతో సమావేశం సమావేశం నిర్వహించారు.

రాయచోటి అర్బన్ సీఐ కర్నూలు వీఆర్‌కు బదిలీ

రాయచోటిటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): రాయచోటి అర్బన్ సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను కర్నూలు వీఆర్‌కు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వుల జారీ చేశారు. ఈయన స్థానంలో కర్నూలు జిల్లా ఆలూరు సీఐగా పనిచేస్తున్న బీవీ చలపతిని నియమించారు. ఈ నెల 4న రాయచోటి పట్టణంలోని వీరభద్రుడు బ్రహ్మోత్సవాల్లో జరిగిన పార్వేట కార్యక్రమంలో హిందూ ముస్లింల మధ్య చోటు చేసుకున్న ఉద్రిక్తపరిస్థితుల నేపథ్యంలో చంద్రశేఖర్‌ను బదిలీ చేస్తూ చర్యలు చేపట్టారు. గతంలో కూడా అయ్యప్ప స్వాముల ఊరేగింపు సందర్భంగా రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సంఘటనల దృష్ట్యా అర్బన్ సీఐని బదిలీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

'హిందూ - ముస్లిం ఐక్యతను ఎవరూ దెబ్బ తీయలేరు'

రాయచోటిటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): కొన్ని వందల సంవత్సరాలుగా అత్యంత ఐకమత్యంతో మత సామరస్యానికి ప్రతీకగా హిందూ-ముస్లింల పండుగలను కలిసి మెలిసి జరుపుకుంటున్న రాయచోటిలోని హిందూ-ముస్లింల ఐక్యతను ఎవరు దెబ్బతీయలేరని అన్నమయ్య జిల్లా టీడీపీ మైనారిటీ కార్యదర్శి షేక్. అతావుల్లా అన్నారు. బుధవారం ఆయన స్థానిక అమానత్ సేవా సొసైటీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వీరభద్రస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 4వ తేదీన వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా హిందూ సోదరులు ఉత్సవ ర్యాలీ నిర్వహించారన్నారు.అయితే హిందూ- ముస్లింల ఐక్యతను చూసి ఓర్వలేని కొంత మంది అల్లరి మూకలు ఉత్సవ ర్యాలీలో చేరి విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేసి రాయచోటిలోని ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేశారన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

రైల్వేకోడూరు,మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ రీసోర్స్‌పర్సన్ సునేష్ తెలిపారు. బుధవారం కలెక్టరు ఆదేశాల మేరకు భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంకల్ప్ ద్వారా రైల్వేకోడూరు పట్టణంలోని గిరిజాలేన్‌లో ఉన్న గ్లోబుల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నైపుణ్య అవకాశాలపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ స్కిల్ డెవలెప్మెంట్ సంస్థ ద్వారా నైపుణ్య ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక స్కౌట్

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. గాలివీడు రోడ్డులో గల అర్చన విద్యాసంస్థల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్ శిక్షణా కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం కరస్పాండెంట్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణకు అన్ని వసతులను, భోజన సదుపాయాన్ని కల్పించామన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ప్రశాంత వాతావరణంలో జాతరలు జరుపుకోవాలి

● డీఎస్పీ కొండయ్యానాయుడు

చిన్నమండెం, మార్చి12(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో జాతరలు జరుపుకోవాలని డీఎస్పీ కొండయ్యానాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయనతోపాటు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో మల్లూరమ్మ, కేశాపురం పాలేటమ్మ జాతరల కోసం పీస్ కమిటీ ఏర్పాటు చేశారు. సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ చాందినీ బండి కట్టేవారు పోలీసు వారి సూచనల మేరకు నడుచుకోవాలన్నారు. ప్రత్యేకంగా పోలీసుల టీములను ఏర్పాటు చేశామని, అసాంఘిక కార్యక్రమలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 250 మంది పోలీసులతో పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను అనునిత్యం డ్రోన్ సాంకేతిక టెక్నాలజీ, సీసీ కెమెరాలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహులు, ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఈవో కొండారెడ్డి ఏఈ రాజేశ్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యానాయుడు, సీఐ

మన్నూరు సీఐ మహ్మద్‌అలీ బదిలీ



రాజంపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మన్నూరు పోలీసుస్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలలకే మహ్మద్‌అలీ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీ ఆర్‌లో ఉన్న కుళాయప్పను మన్నూరు సీఐగా నియమించనున్నట్లు కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ మహ్మద్‌అలీ అన్నమయ్య జిల్లా సైబర్ సెల్‌కు బదిలీ చేశారు.

సారా విక్రయిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

సిద్దవటం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖ పరిధిలోని సిద్దవటం, ఒంటిమిట్ట, అట్లూరు మండలాల్లో సారా విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో బుధవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ పరిధిలోని సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట గ్రామాల్లో ఎవరైనా నాటుసారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కొన్ని పల్లె ప్రాంతాల్లో నిఘా వేసి ఉంచుతామని తెలియజేశారు.

'భూ ఆక్రమణదారులను కఠినంగా శిక్షించాలి'

రాయచోటిటౌన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని సంబేపల్లె మండలం సంబేపల్లె గ్రామంలో నివాసం ఉంటున్న చాట్ల సంపూర్ణ అనే దళిత మహిళకు సంబంధించిన భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆక్రమణకు గురైన దళితుల భూమిని పరిశీలించిన అనంతరం రాయచోటిలో మీడియాతో మాట్లాడారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామ పరిధిలోని ఖాతా నెంబర్ 830, సర్వే నెంబర్ 1011-5లో 0.37 సెంట్లు, సర్వే నెంబర్ 1012-3లో 4 ఎకరాలు భూమి దళిత మహిళ చాట్ల సంపూర్ణ పేరుతో ఉందన్నారు. ఈ భూమిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అనే ప్రభుత్వ పథకం సహాయంతో మామిడి చెట్లను తీసుకొని మామిడి తోటగా అభివృద్ధి పరుచుకున్నారన్నారు. ఈ క్రమంలో ఆ మామిడి తోటకు పక్కనే కొంత భూమి గల ప్రకాశ్‌నగర్‌కాలనీ గ్రామం రేగడిగుంటవారిపల్లెకు చెందిన అగ్రకులానికి సంబంధించిన శెట్టిపల్లి రెడ్డెప్పరెడ్డి అనే వ్యక్తి కంచె లోపల ఉన్న చెట్లను నరికేసి, ఆ భూమి నాది అంటూ తోటను ఆక్రమించుకున్నాడన్నారు. ఆ దళిత మహిళ సంబేపల్లె తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేసిందన్నారు. అయితే ఈ సంఘటన జరిగి నాలుగు రోజులవుతున్నా ఇంతవరకు సంబంధిత అధికారులు స్పందించకపోగా ఆ దళిత మహిళనే అవమానకర రీతిలో మాట్లాడి నువ్వే నీ చెట్లను నరికేసుకున్నావేమో అని హేళనగా మాట్లాడి మనోవేదనకు గురిచేశారన్నారు. ఆ భూమిని తిరిగి ఆమెకు చెందేటట్లు వేసి మామిడి చెట్లు నరికివేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నష్టపరిహారం ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్

‘మీ-సేవ’ అయోమయం!

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించిన మీ-సేవా కేంద్రాల పునరుద్ధరణపై నిర్వాహకుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ ప్రకటించడంతో కొంత ఉపశమనం పొందారు. అయితే,వాట్సాప్ గవర్నెన్స్‌పేరుతో ఇటీవల చంద్రబాబు చేసిన ప్రకటన వారిని అయోమయంలోకి నెట్టింది.



- సచివాలయ వ్యవస్థతో నడ్డివిరిచిన జగన్
- రోడ్డునపడ్డ వేలాది కుటుంబాలు
- అమలుకు నోచుకోని నారా లోకేశ్ హామీ
- వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభంతో ఆందోళన

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంత వరకు ఓ వెలుగు వెలిగిన మీ-సేవాకేంద్రాలకు జగన్ రూపంలో ఉపద్రవం వచ్చిపడింది. మీ- సేవ కేంద్రాలు అందించే సర్వీసులను సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామంటూ మొదలుపెట్టి, నాలుగు రోజులు గడవకనే రుసుం వసూలు ప్రారంభించారు. మీ-సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రచారం చేయించారు. దీంతో జనం మీ-సేవ కేంద్రాలకు వెళ్లడం దాదాపుగా మానేశారు. దీంతో నిర్వహణ ఖర్చులు భరించలేక చాలా మంది మీ-సేవ కేంద్రాలను మూసివేయగా, కొందరు మంచిరోజులు మళ్లీ వస్తాయనే ఆశతో నెట్టుకొస్తున్నారు.

రోడ్డునపడ్డ కుటుంబాలు..

రాష్ట్రంలో 2019కి ముందు 11 వేలకు పైగా మీ-సేవ కేంద్రాలుండేవి. వీటి ద్వారా రెవెన్యూ, ఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర 36 శాఖలకు చెందిన 329 సర్వీసులు ప్రజలకు సకాలంలో అందేవి. ప్రభుత్వం నిర్దేశించిన రుసుములో కొంతభాగం కమిషన్ రూపంలో వీరికి దక్కేది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఒక్కొక్క టిగా ఈ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.



మీ సేవ నిర్వాహకుల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న నారాలోకేశ్ (ఫైల్‌ఫోటో)

వాట్సాప్ గవర్నెన్స్ ప్రకటనతో అయోమయం..

మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు విజయవాడలో చేస్తున్న ఆందోళనకు అప్పటి రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెంనాయుడుతో కలిసి నారాలోకేశ్ సంఘీభావం తెలపడమే కాకుండా, అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలకు ప్రాణం పోస్తానని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. టైం..డేట్ కూడా రాసిపెట్టుకోండని గట్టిగానే చెప్పారు. అయితే, ఇటీవల ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్ ప్రకటనతో మీ-సేవ నిర్వాహకుల గుండెల్లో రాయి పడింది. దాని విధివిధానాలు పూర్తిగా ఖరారు కాకపోయినా, తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

‘మీ-సేవ’ను ఆదుకోవాలి..

మీ-సేవ కేంద్రాలను ప్రభుత్వం ఆదుకోవాలి. లోకేశ్‌బాబు హామీని నిలుపుకోవా లి. రూము అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు చేతినుంచి వేసుకొని కేంద్రాలు నడుపుతు న్నాము. గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి మరీ దారుణంగా వుంది. ఇప్పటికే చాలా వరకు మూతపడ్డాయి. మమ్మల్ని ఆదుకోండి.

- రాజేష్, బి.కొత్తకోట

ఆలయాల సంరక్షణ అత్యంత ఆవశ్యకం

- పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామి

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి):భారతదేశంలో ఆలయాలను కాపాడాల్సిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉందని పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామి అన్నారు. బుధవారం మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామం, చిట్టి అన్నవరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో సత్యదేవ సదన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భారతదేశంలో ఆధ్యాత్మిక చింతన తగ్గిపోతోందని, దీని పునరుద్ధరణకు ఆలయాల ఆలయాల సంరక్షణ అత్యవసరమన్నారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, అర్చనల్లో ఆయన పాల్గొన్నారు. సత్యదేవ సదన్‌లో అన్ని గదులు తిరిగి కర్పూరహారతులు అందించి, పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు సందేశం ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అంతకుముందే ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.



సత్యదేవ సదన్‌ను ప్రారంభిస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతీ స్వామి

కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు ఎ.అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కో ఆర్డినేటర్ శివశంకర్, జ్ఞానోదయ కామకోటి ప్రసాదరావు, రమణరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ వివాదం పరిష్కరించండి

- ఏపీఐఐసీ ఎండీని కోరిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ స్థల వివాదం పరిష్కరించాలని ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. బుధవారం విజయవాడలో ఏపీఐఐసీ కార్యాలయంలో ఎండీతో మాట్లాడుతూ ఆటోనగర్ లేక పోవ డంతో 20 ఏళ్లుగా మదనపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొ మ్మిదేళ కిందట వలసపల్లె వద్ద ఆటోనగర్‌కు స్థలం సేకరించినా, స్థల విషయం పై కొందరు కోర్టులో కేసు వేశారన్నా రు. తగిన రీతిలో నష్టపరిహారం ఇప్పిస్తే, రైతులు కేసు వాపసు తీసుకుంటారని, వివాదం సమసిపోతుందన్నారు. సమస్య పరిష్కారానికి ఏపీఐఐసీ ఎండీ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట యుగంధర్, గురుమూర్తి, సీతక్క తదితర రైతులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ ఎండీతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రైతులు

ఆస్తి పన్ను మినహాయింపు అమలు చేయాలని ఆందోళన

మదనపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఆస్తి పన్ను, నీటి పన్ను మినహాయింపును అమలు చేయాలంటూ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ సైనికులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీసైనికులకు పూర్తిస్థాయిలో ఆస్తిపన్ను, వాటర్ ట్యాక్సులో 20 శాతం మినహాయిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ఈ జీవోను అమలు చేయకపోగా, బకాయిలు చెల్లిస్తేనే, తర్వాత అమలు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కొత్తగా ఇల్లు నిర్మించిన, కొనుగోలు చేసిన వారి విషయంలో వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మున్సిపాలిటీకి, అక్కడి నుంచి ఉన్నతాధికారులకు పంపడంలో జాప్యం చేయడం, తదితర కారణాలతో సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఆర్ఓ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మాజీసైనికులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులు ఢీ : కండక్టర్ మృతి



గంగాధర్‌బాబు (ఫైల్‌ఫోటో)

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు లోని రాయల్పాడు సమీపంలో మంగళవారం సువర్ణముఖి ప్రైవేట్ బస్సును బెంగళూరుకు వెళుతున్న ఏఆర్ అండ్ బీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన కండక్టర్ గంగాధర్ బాబు(58) మృతి చెందారు. సుమారు 40 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో కొం దరిని మదనపల్లెలోని ప్రభు త్వ ఆస్పత్రికి తరలించగా మరికొంతమంది కర్ణాటకలోని చింతామణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ పోషకుడు మృతి చెందడంతో రోడ్డున పడ్డామని గంగాధర్‌బాబు భార్య మంజుల, కూ తుళ్లు అనూషా, శైలజ విలపించారు. రాయల్పాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కువైత్‌లో కోడూరు వాసి ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)


రైల్వేకోడూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన కొల్ల శ్రీనివాసులు(38) కువైత్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనివాసులుకు నాలుగేళ్ల కువైత్‌లో ఉండి ఇటీవలే ఇంటికి వచ్చాడు. ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో ఇల్లు విక్రయించి, భార్య అన్నపూర్ణతో కలిసి మూడు నెలల క్రితం మళ్లీ కువైత్‌కు వెళ్లారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కువైత్‌లోని తన గదిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు భార్య అన్నపూర్ణ సమాచారం అందించిందని బంధువులు తెలిపారు. శ్రీనివాసులు కుమారులు బాలాజీ, రామ్‌చరణ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ అతని తల్లి పార్వతమ్మ సంరక్షణలో ఉన్నారు

ఆర్టీసీ బస్సులో కిలేడీలు

- మహిళ పర్సులోని బంగారు నగల అపహరణ

రాజంపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సులో నలుగురు కిలాడీలు ఓ మహిళకు చెందిన బంగారు నగలను అపహరించారు. నందలూరు మండలం కుంపిణీపురం బలిజపల్లెకు చెందిన చిన్నం సరస్వతి తన మనవడికి తిరుమలలో పుట్టువెంట్రుకలు తీయించేందుకు బుధవారం ఇంటిలో ఉన్న బంగారాన్ని హ్యాండ్‌బ్యాగులో ఉంచుకుని, అదే గ్రామానికి చెందిన గణపతి శారద అనే మహిళతో కలసి నందలూరు బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండులోని దుకాణం వద్ద బ్యాగును తెరవడం, బంగారు నగలను పక్కకు తీసి డబ్బు ఇవ్వడం బస్టాండులో ఉన్న నలుగురు మహిళలు గమనించారు. జమ్మలమడుగు - తిరుపతి బస్సులో ఎక్కిన సరస్వతి, శారదలను అను సరించారు. టిక్కెట్ కొనుగోలుకు పర్సు తెరచిన సమయంలో ఒక రు ఆమె సాయం చేస్తున్నట్లు నటించగా, మిగతా ముగ్గురు ఆమెపై పడి పోయారు. ఆ సమయంలో చాకచక్యంగా పర్సులో ఉన్న బం గారు నగలు దొంగలించారు. బోయనపలె రాగానే బస్సు దిగి వెళ్లిపోయారు. అనంతరం పర్సు గమనించిన సరస్వతి బస్సు డ్రైవర్, కండక్టర్లకు విషయం తెలపడంతో మన్నూరు పోలీసుస్టేషన్ వద్ద బస్సు ఆపి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ మహ్మద్‌అలీ నలుగురు కిలాడీలేడీలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు.

గుట్టలో దొరికిన చిన్నారి రాయచోటికి తరలింపు



బిడ్డను అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ములకలచెరువు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుట్టలో దొరికిన చిన్నారిని ఐసీడీఎస్ అధికారులు మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. స్థానిక ఉమాశంకర్ కాలనీ సమీపంలోని జనసంచారం లేని గుట్టలో చిన్నారిని సుమియా అనే మహిళ అక్కున చేర్చుకున్న విష యం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారిని పోలీసుల పర్యవేక్షణ మధ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించారు. అనంతరం రాయచోటి శిశు సంరక్షణ కేంద్రంలో అప్పగించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

సంబేపల్లె, మార్చి12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పనులకోసమే వారాది అనే వ్యక్తిని హత్య చేసినట్లు రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మార్చి రెండున ముద్దినేనివాండ్లపల్లె సమీపంలోని మల్లూరమ్మ గుడి వద్ద సిమెంటుకు కాపలా కాస్తున్న వారాది అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. కల్వర్టు నిర్మాణం కాంట్రాక్టు పని తనకు వచ్చిందని, సిమెంటు రోడ్డు పనులు కూడా తానే చేస్తానని వారాది గ్రామంలో చెబుతుండడంతో జీర్ణించుకోలేక బెల్లం యోగానందరెడ్డి అనే వ్యక్తి చిన్నికృష్ణ సాయంతో సిమెంటుకు కాపలా కాస్తూ నిద్రపోతున్న వారాదిపై బండరాయితో దాడి చేసి చంపినట్లు తెలిపారు.

అవినీతి కేసులో ‘రిజిస్ట్రేషన్’ సిబ్బంది ఇంక్రిమెంట్లలో కోత

కలికిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కడప అర్బన్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 2019లో పనిచేసిన ఏడుగురు సిబ్బందికి క్యుములేటివ్ ప్రాతిపదికన మూడేసి ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2017 జూలై 12న అర్బన్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు దండు వెంకట సుబ్బా రెడ్డి, ఆవుల రంగనాథబాబు, స్టాంపుల డిపో జూనియర్ అసిస్టెంట్లు ఎనమల వెంకట్రమణ, కడిమెల్ల రెడ్డెయ్యరాజు, షరాఫ్ షేక్ మస్తాన్‌వలీ, ఆఫీస్ సబార్డినేట్‌లు కోకల శ్రీనివాసులు, కోలా సుబ్బలక్ష్మమ్మ వద్ద అవినీతికి సంబంధించిన ఆధారాలు లభించడంతో ఏడుగురిపైన కేసు నమోదు చేశారు. దీనిపై సంజాయిషీ నోటీసులు జారీ చేసి పలుమార్లు విచారణ చేసిన అనంతరం, ఈ వ్యవహారాన్ని కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌కు అప్పగించారు. ఏడుగురినీ కలిపి ఒకే కేసుగా పరిగణించి కేసును కొనసాగించారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి ఆర్.పి. ఠాకూర్ ఆధ్వర్యంలో ఏర్పడిన విచారణ కమిషను కేసును కూలంకషంగా విచారించి అందరినీ దోషులుగా నిర్ధారించింది. ఆధారాలతో సహా కేసు నిరూపణ జరిగింది. చివరగా ఏడుగురి నుంచి కడప స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల డీఐజీ చివరి సంజాయిషీలు తీసుకుని ఈ నెల 2న ప్రభుత్వానికి అందజేశారు. పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం ఏడుగురికీ క్యుములేటివ్ పద్ధతిలో మూడేసి ఇంక్రిమెంట్లు కోత విధించింది. ఆ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ శిశోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కంది రైతులు సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి

రామాపురం, మార్చి12(ఆంధ్రజ్యోతి): కంది పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలంటే సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని చిట్లూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మార్కెట్ యార్డులోని కందులు కొనుగోలు కేంద్రంలో కందులు క్వింటాల్ ధర రూ.7,550 కనీస మద్దతు ధర ఇస్తారని రైతులకు తెలియజేశారు. సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు మాత్రమే వ్యవసాయ అనుబంధ శాఖల నుండి లభించే పథకాలకు అర్హులని తెలిపారు. వేరుశనగలో జిప్సం ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పంటల బీమా ప్రయోజనాలు వివరించారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేసిన పంట వివరాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19 లోపు రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి వై. నాగమణి, ఏఈవో ప్రసంజిని, వీహెచ్‌ఏ యాసిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

సమగ్ర యాజమాన్యంతో పూత, పిందెకు రక్షణ

పీలేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో మామిడి పూత, పిందెను కాపాడుకోవచ్చని కలికిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సమీకృత ఉద్యాన మిషన్‌లో భాగంగా బుధవారం పీలేరు మండలం కాకులారం పల్లె పంచాయతీ కోళ్లఫారం, బాలంవారిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లెల్లో మామిడి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పిందె, పూతను తేనె మంచు పురుగు, తామర పురుగు, ఆంత్రాక్నోస్ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు బుప్రోఫ్యూజిన్ 20%, అసిఫేట్ 50%, పైమెట్రోజన్, సాఫ్, థయోఫినైట్ మిథైల్ తగు మోతాదుల్లో వాడాలన్నారు. పిందెలు రాలుతున్నట్లు అనిపిస్తే ప్లానోఫిక్స్ అనే మందును 4.5 లీటర్ల నీటికి 1 మిల్లీలీటరు కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులందరూ ఫ్రూట్ కవర్లు కట్టుకోవాలని సూచించారు. కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల పండు ఈగ, మసి మంగు నుంచి కాయకు రక్షణ ఉంటుందన్నారు. కవర్లు కట్టిన కాయలన్నీ ఒకే సైజులో, మంచి నాణ్యతతో ఉంటాయన్నారు. దూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నప్పుడు కాయలు త్వరగా చెడిపోకుండా ఉంటాయన్నారు. అధిక గాలి వచ్చినప్పుడు కాయలు రాలకుండా కవర్లు రక్షణ కల్పిస్తాయని, ఎటువంటి రసాయన అవశేషాలు లేనందు వల్ల కవర్లు కట్టిన కాయలకు మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓ సుకుమార్ రెడ్డి, ఏఓ రమదేవి, రైతులు రమణ, షౌకత్‌అలీ, సురేంద్రనాథరెడ్డి, ఏఈవోలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



కాకులారంపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు భరోసా..

- టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని
- మెగా జాబ్‌మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు

రైల్వేకోడూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మెగా జాబ్ మేళానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసినప్పుడు రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఉద్యోగాలు లేక, గల్ఫ్ కు వెళుతున్నారని వివరిచడంతో ఆయన స్పందించి అమరరాజా, మోటరోలా, అపోలో సంస్థల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించ వచ్చునని తెలపడంతో ఆయా సంస్థలతో కలసి మాట్లాడి మెగా జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవనకళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగార్జునరావు, తెలుగు యువత సీనియర్ నాయకుడు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, మల్లెం హేమంత్, చాపలమడుగు సూర్యప్రకాష్ చౌదరి, కస్తూరి దినేష్, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు దక్కించుకున్న యువతతో పంతగాని, ఆయా సంస్థల ప్రతినిధులు

మహిళపై చిత్రహింసలు..నలుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఆమె భర్తతోపాటు, మరో ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీకి చెందిన టి. సంఘవికి పదేళ్ల క్రితం కలికిరి మండలం గుట్టపాలెంకు చెందిన వెంకటరమణతో వివాహం జరిగింది. అయితే వీరికి ఇద్దరు కుమారులు. కాగా వెంకటరమణ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని సంఘవిని చిత్రహింసలకు గురిచేసేవాడు. అతని తల్లి రమణమ్మ(51),చెల్లి శివమ్మ(38) తమ్ముడు మనోహర(32) కూడా చిత్రహింసలు పెట్టేవారు, ఈ విషయంలో గతంలో కూడా కలికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రాజీ కుదిర్చినట్లు తెలిపారు. అయినా వారు మారకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి

- మూడు జిల్లాల్లో 19మందికి అవకాశం

మదనపల్లె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 19 మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లా కలెక్టర్, నోడల్ ఆఫీసర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని మండలాలు, జిల్లా కేంద్రాల్లో సీనియర్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులుగా పని చేస్తున్నారు. పదోన్నతి పొందిన వారిలో కె.మాధవి(తిరుపతి కలెక్టరేట్), డి.రాజశేఖర్(చిత్తూరు కలెక్టరేట్), టి.బాలాజీ(పెద్దతిప్పసముద్రం), ఆర్.మోహన్(చిత్తూరు డీఎస్‌వో కార్యాలయం), పి.చాణక్య(అన్నమయ్య డీఎస్‌వో కార్యాలయం), బి.నందినీదేవి(పలమనేరు), వి.రేఖ(చిత్తూరు కలెక్టరేట్), జి.కృష్ణమ్మ(ఆర్.సి.పురం), జి.మస్తాన్‌కమలాకర్(అన్నమయ్య కలెక్టరేట్), ఎస్.అనీష(ములకలచెరువు), బి.జోసెఫ్(చిత్తూరు కలెక్టరేట్), ఎం.శిరీష(చిత్తూరు డీఎస్‌వో కార్యాలయం), బి.సుధాకర్‌నాయక్(రొంపిచెర్ల), బి.భాస్కర్(చంద్రగిరి), ఎం.నరేంద్ర(గంగవరం), పి.శోభ(చిత్తూరు కలెక్టరేట్), బి.నాగరాజు(తొట్టంబేడు), ఆర్.మధుసూదన్(బంగారుపాళెం), జి.యోగేష్(చిత్తూరుకలెక్టరేట్)ఉన్నారు. వీరికి జిల్లాలు కేటాయించిన అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లు.. కేంద్రాలు, మండలాల వారీగా పోస్టింగ్ ఇవ్వనున్నారు.

మార్కెట్ వేలం వాయిదా

కమలాపురం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన దినసరి మార్కెట్ , బస్టాండు, జంతు వధశాలల్లో రుసుము వసూలు హక్కుల వేలంలో ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేసినట్లు నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ఈ వేలంను 18వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన వివరించారు.

మార్కెట్ సెస్సు వేలంతో అంగళ్లు పంచాయతీకి రూ.1.05 కోట్ల ఆదాయం

కురబలకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతల్లో సెస్సు వసూలు హక్కులకు నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి ఆదాయం దక్కింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతలకు వేలం నిర్వహించగా, అంగళ్లుకు చెందిన పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి. టమోటా మార్కెట్‌ను రూ.45.40 లక్షలకు, మదనపల్లెకు చెందిన సత్తార్‌ఖాన్ గొర్రెల సంతను రూ.52.10 లక్షలకు, యు.శ్రీనివాసులు వారపు సంతను రూ.7.70 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, డీఎల్‌డీవో నాగరాజ, ఎంపీడీవో గంగయ్య,ఈవోపీఆర్‌డీ అశ్వని, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లోని గదుల వేలానికి దేవదాయశాఖ అధికారుల కసరత్తు

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఉన్న దేవదాయశాఖ ఆధ్వర్యంలో గదుల వేలానికి సాధ్యాసాధ్యాలను జిల్లా దేవదాయ శాఖ అధికారులు బుధవారం అధ్యయనం చేశారు. కొండ మీద అతిపురాతనమైన ఏనుగుమల్లమ్మ ఆలయం వుంది. కోటావూరు పంచాయతీ పరిధిలోని పలుగ్రామాల ప్రజలు ప్రతియేటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయం ముందుభాగంలో ఉన్న గదులను బహిరంగ వేలం ఎందుకు వేయలేదంటూ దేవదాయశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్‌కు మెమో ఇచ్చారు. దీంతో ఆయన జిల్లా టూరిజం అధికారి నాగభూషణంతో కలిసి బుధవారం హార్సిలీహిల్స్‌కు చేరుకొని వేలం వేయదలచిన గదులను పరిశీలించారు. ఏనుగు మల్లమ్మ ఆలయానికి చట్టబద్ధంగా 0.40 ఎకరాల భూమి మాత్రమే వుందని, ప్రస్తుతానికి టూరిజం అధికారుల సహ కారంతో గదులను వాడుకోవడంతో పాటు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నామని ఆలయ ధర్మకర్త రాజేంద్రనాథ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి ఎండోమెంట్ అధికారులకు వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, తదుపరి ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుందని ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.

భూఆధార్

వ్యవసాయ రంగంలో అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు అర్హులకు మాత్రమే అందేలా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకుంటు న్నాయి. ఇందులో భాగంగా నిజమైన లబ్ధిదారులకు మేలు జరిగేలా వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు యూనిక్ కార్డును జారీ చేస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఫార్మర్ రిజిస్ట్రి పేరిట జిల్లాలో చేపడుతున్నారు.

- రైతన్నల సంక్షేమం కోసం..
- 14 అంకెలతో ప్రత్యేక కార్డు జారీ
- పథకాలు, ప్రోత్సాహాల లబ్ధికి కీలకం
- పట్టా భూములకే ప్రయోజనం
- ఆందోళనలో పేదరైతాంగం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభు త్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డులు జారీ చేస్తోంది. ఇది కేంద్రంలోని వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్ కార్డును జారీ చేస్తారు. ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉప యోగపడుతుంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పేర్లు నమోదు చేపట్టడం ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి దేశ వ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మంది రైతులకు భూఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

జిల్లాలో మొత్తం 2,40,672 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 97,646 మంది రైతుల వివరాలు నమోదు చేశారు. ఇంకా 1,43,026 మందికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ నమోదు కొనసాగుతూనే ఉంది. ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు అవుతున్న పథకాలు, రాయితీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. సొంతభూమి ఉన్న రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నెంబర్ లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉన్న ఫోన్ తీసు కెళ్లాలి. రైతు సమక్షంలోనే రైతు సేవా కేంద్ర సిబ్బంది నిర్దిష్ట పోర్టల్‌లో రైతు భూమి వివరాలు ఆధార్‌కార్డు పంక్షన్ నెంబర్ నమోదు చేస్తారు. నమోదు పూర్తికాగా నే రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని రైతు సేవ కేంద్రం సిబ్బందికి తెలియజేస్తే నమోదు ప్రక్రియ పూర్తయి రైతు లకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుంది.

యూనిక్‌కార్డుతో లాభాలు

ప్రస్తుతం జారీ చేస్తున్న యూనిక్ కార్డుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతు న్నారు. రాయితీలు, అనేక సంక్షేమ పథకాలు ఈ కార్డు ద్వారా అందజే స్తారని వివరిస్తున్నారు. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీ భవ, పంటల బీమా, వ్యవసాయ పరికరాల రాయితీలు, పంట పెట్టుబడి, ఎరువుల రాయితీలు, కనీస మద్దతు ధర పంట రుణా లు పొందే ప్రక్రియను ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య మరింత సులభ తరం చేయనుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటు న్నారు. మరి కొంతకాలం తర్వాత ఉద్యాన రైతులు వివరాలను కూడా సేకరించి అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులో కౌలు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, వ్యవసాయ అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి వివరాలను కూడా సేకరించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పట్టా భూములకేనా... ప్రయోజనం

ప్రస్తుత వ్యవసాయశాఖ చేపడుతున్న విశిష్ట గుర్తింపు సంఖ్య సొంత భూముల రైతులకే కేటాయిస్తుండడంపై మిగిలిన రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా ప్రభు త్వాలు పంపిణీ చేసిన డీకేటీ భూములకు సంబందించి ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం వెల్లడి కాకపోవడంతో పేద రైతాంగం నిరాశలో ఉన్నారు. సొంత భూమి ఉన్న రైతులకే పేర్ల నమోదు కార్డుల జారీకి సుదీర్ఘకాలం పట్టే అవకా శాలు కనిపి స్తున్నాయి. తమ వరకు వచ్చేటప్పటికి ఏ నిబంధనలతో నమోదు కార్యక మాన్ని చేపడుతారో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే రెవెన్యూశాఖ నుంచి ముందుగా వివరాలు సేకరించిన తర్వాతనే డీకేటీ భూములకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సొంత భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తమకు సంబంధించిన రైతుసేవ కేంద్రంలో వివరాలను నమో దు చేయించుకోవాలి. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి చేకూరే లబ్ధి ఈ సంఖ్య ఉంటేనే అమలయ్యే పరిస్థితి ఉంటుంది.

– నరసింహారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ



రైతు సేవా కేంద్రంలో వివరాలను నమోదు చేస్తున్న దృశ్యం

బాధితులకు సత్వరం న్యాయం చేయాలి



రాజుపాలెం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాజుపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏదైనా సమస్యపై పోలీసుస్టేషనుకు బాధితులు వచ్చినప్పుడు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. రాజుపాలెం పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న సమస్య అయినా ఫిర్యాదు చేస్తే పెండింగు లేకుండా సత్వరం పరిష్కా రం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కువగా రైతులకు పొలం గట్లు, భూసమస్యలుంటాయని, అవి ఎలాంటి పరిణామాలకైనా దారితీస్తాయని.. వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాలన్నారు. ప్రజలకు సైబ ర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తొండలదిన్నె గ్రామం లోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఎస్పీ అశోక్‌కుమార్ తన స్నేహితుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండడంతో.. అతని కోరిక మేరకు అక్కడికి వెళ్లి విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. కార్య క్రమంలో ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ కత్తి వెంకటరమణ పాల్గొన్నారు.

250 బస్తాల చౌక బియ్యం స్వాధీనం



పట్టుబడ్డ బియ్యం బస్తాలతో సీఐ పురుషోత్తంరాజు

చెన్నూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం 250 బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తోళ్లగంగనపల్లె రోడ్డు సమీపంలో ఓ రేకులషెడ్డులో నిల్వ ఉంచిన 150 బస్తాలు, గోపవరం సమీపం లోని కేసీ ప్రధాన కాల్వ సమీపంలో నిల్వ ఉంచిన వంద బస్తాలను సీఐ పురు షోత్తంరాజు ఆధ్వర్యంలో పట్టుకుని బాబయ్యను అరెస్టు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని డీటీ ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ స్టాకు పాయింటుకు తరలించారు. పోలీసు సిబ్బంది పుష్పరాజు, శ్రీనివాస రాజు, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకటుబ్బయ్య పాల్గొన్నారు.

13 జిల్లాల్లో 'అగ్నివీర్' నోటిఫికేషన్

గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అగ్నివీర్ నియా మకాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఆర్మీ రిక్రూటింగ్ గుంటూరు బ్రాంచ్ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. WWW.joinindinarmy.nic.in వెబ్ సైట్‌లో ఏప్రిల్ 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు అగ్నివీర్ విభాగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని.. ఆన్‌లైన్ ఉమ్మ డి ప్రవేశ పరీక్ష(సీఈఈ) తొలిసారిగా తెలుగు సహా 13 వేర్వేరు భాషల్లో జరు గుతుందని వెల్లడించారు. అన్ని కేటిగిరీలకు ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలి గిన, ప్రతిభావంతులైన క్రీడాకారులు, టెక్నికల్ కేటిగిరీ పోస్టుల కోసం ఐటీఐ /డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇస్తారని తెలిపారు.

ఎట్టకేలకు టీడీపీ కుటుంబాలకు తాగునీరు

నిమ్మనపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అధికారుల చొర వతో ఐదేళ్లగా తాగునీరు అందక బాధ పడుతున్న టీడీపీ కుటుంబా లకు బుధవారం తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపినట్లు ఎంపీ డీఓ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. వెంగంవారిపల్లి పంచాయతీ ముతక వారిపల్లిలో టీడీపీ కుటుంబాలకు వైసీపీ నేతలు తాగునీరు ఇవ్వ కుండా ప్రభుత్వ బోరుకు తాళాలు వేసుకున్నారు. ప్రస్తుతం టీడీపీ కుటుంబాలకు అధికారులు, సర్పంచ్ శ్రీవాణి సహకారంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, టీడీపీ నేతలు నవీన్, శివగెంగిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో నిలవాలి

- స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్



మాట్లాడుతున్న స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్య పరిశోధన ప్రమాణాలకు నెలవైన యోగివేమన విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రాజంపేట స్పెష ల్ జ్యుడీషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ ఆకాంక్షించారు. బుధవారం వైవీయూ 19వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవం డాక్ట ర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో అతి థు ల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ సాధించాలనే తపన, సంకల్పబలం ఉన్నవారే విజేతల జాబితాలో నిలుస్తారన్నా రు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. దాని సాధనకోసం నిరంతరం శ్రమించాలన్నారు. చరిత్రలో మీకో పేజీ ఉండేలా మీ ప్రణాళికలు ఉండాలన్నారు. ఆకాశంలో ఎగిరే గాలిపటం మీరేతై దానికి ఉన్న దారం మీ తల్లిదండ్రులని దిశా నిర్దేశం చేస్తూ.. మిమ్మల్ని కాపాడుకుంటూ ఉంటారనే విషయాన్ని నిత్యం గుర్తుం చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లా డుతూ విద్య పరిశోధనలో విశ్వవిద్యాలయం అద్భుతమైన ప్రగతిని సాధించిందన్నారు. విద్యాలయ అధ్యాపకులు, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు, ప్రాజెక్టులు, పేటెంట్లు తెచ్చారన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ పరి శోధన సమన్వయం, విద్యార్థులు అవకాశాలలు కల్పించడంలో భాగంగా 8 ప్రముఖ సంస్థ లతో ఎంఒయూ కుదుర్చుకున్నామని తెలిపారు. అనంతరం వైవీయూ ఉపకులపతి ఆచార్య పి.ప్రకాష్ బాబు పంపిన సందే శాన్ని చదవి వినిపించారు. ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సారా తయారీ, విక్రేతలకు పథకాలు నిలిపివేత



తండాలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

పీలేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారీ, విక్రేతలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరిం టెండెంట్ మధుసూదన్ పేర్కొన్నారు. పీలేరు మండలం జాండ్ల పం చాయతీ మర్రిమాకులపల్లె తండాలో బుధవారం నవోదయం 2.0పై గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లా డుతూ నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా నవో దయం 2.0 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అవగాహన సదస్సులు, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు కల్పించినా నాటు సారా తయారీ మానని కుటుంబాలకు సంక్షేమ పథకాలు నిలిపివేయడమే కాక పీడీ యాక్టు ప్రయోగిస్తా మన్నారు. అవసరమైన ముడిసరుకుల సరఫరాదారులు, విక్రేతలు, బ్రోకర్లు, అతిగా సేవించే వారిపై కూడా పీడీ యాక్టు ప్రయోగి స్తామని హెచ్చరించారు. ఎంపీడీఓ శివశంకర్, అర్బన్ సీఐ యుగం ధర్, ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి, డీటీ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకిపురంలో నవోదయం 2.0

వాల్మీకిపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఎగువ, దిగువ మేకల వారిపల్లె గ్రామాల్లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోద యం 2.0 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ లత పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు.

ఏఎఫ్ఏయూలో 1,3 సెమిస్టర్ ఫలితాలు విడుదల



కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనవర్సిటీలో బుధవా రం ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి 1,3 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్, రిజిస్ట్రార్ రాజజేష్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. అదనపు పరీక్షల నియం త్రణ అధికారి జి.పణీంద్ర రెడ్డి, సహాయ అధికారి ఉదయ్ ప్రకాష్‌రెడ్డి, నారపురెడ్డి, పీఆర్ఓసెల్ వి.శివకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

పొలతల హుండీ ఆదాయం రూ.33,37,829

పెండ్లిమర్రి;మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వర స్వా మి ఆలయ శాశ్వత హుండీల ద్వా రా రూ.33,37,829ల ఆదాయం వచ్చి నట్లు ఆలయ ఈఓ కృష్ణా నాయక్ తెలిపారు. బంగారు సుమారు 50 గ్రాములు, వెండి నాలుగు కిలోలు వచ్చాయన్నారు. దేవదాయ సూప రింటెండెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం ఇప్పిస్తాం : జేసీ



ఎర్రగన్నమిట్ట వద్ద ఎన్‌హెచ్-71 భూసేకరణపై సూచనలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయం రహదారి విస్తరణలో భూము లు, ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయమైన నష్టపరిహారం ఇప్పిస్తామని, భూసేకరణకు ప్రభుత్వానికి సహకరించా లని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధ వారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె, ఎర్రగన్నమిట్ట వద్ద ఎన్‌హెచ్-71 విస్తరణలో భూసేకరణకు పెండింగ్ ఉ న్న ప్రాంతాలను జేసీ పరిశీ లించారు. ఈ సందర్భంగా రైతులు, ఇళ్ల యజమాను లతో జేసీ మాట్లాడుతూ జాతీయరహదారి నాలుగు లేన్ల విస్తరణలో కొన్ని చోట్ల భూసేకరణ ఆలస్యమవు తోందని, ప్రజలు సహకరించాలన్నారు. సాధ్యమైనంత ఎక్కువగా నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఎన్‌హెచ్ఏఐ ఇంజనీర్లకు పలు సూచనలు జారీ చేశారు. అనంతరం పోతబోలు లేఅవుట్ వద్ద ఎంఐజీ లేఅవుట్ వేసేందుకు అవసర మైన డీకేటీ భూములను జేసీ పరిశీలించారు. డీకేటీ భూములతో పాటు అవసరమైతే 20 ఎకరాల విస్తీ ర్ణంలో రైతుల భూమి సేకరించి ఎంఐజీ లేఅవుట్‌కు సిద్ధం చేయాలని తహసీల్దార్ ధనంజయులును ఆదే శించారు. కార్యక్రమంలో సర్వేయర్ రెడ్డిశేఖర్‌బాబు, వీఆర్‌ఓలు, ప్రజలు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు రూ.17.39 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండకు మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా హుండీ, సేవా టికెట్లు, చందాలు, కల్యాణో త్సవం చదివింపుల ద్వారా రూ.17,39,228 ఆదాయం వచ్చింది. కాగా బుధవారం హుండీని లెక్కించగా రూ.12,30,310 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. బుధవారం కొండ పైన ఆలయంలో ఎస్ఐ లోకేష్‌రెడ్డి, కూటమి నేతలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. కాగా, శివరాత్రి ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు (ఫిబ్రవరి 27)న లెక్కించిన వివిధ సేవా టికెట్లు, కల్యాణో త్సవం చదివింపులు, చందాలు, తాత్కాలిక హుండీలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మల్లయ్యకొండకు రూ.5,08,918 ఆదాయం వచ్చింది. దీంతో మల్లయ్యకొండకు మొత్తం ఆదాయం రూ.17,39,228 వచ్చింది. కాగా గత ఏడాది శివరాత్రి ఉత్సవాల్లో రూ.12,51,219 ఆదాయం రాగా ఈ ఏడాది భారీగా పెరిగింది. హుండీ లెక్కింపులో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, సిద్దమ్మ, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, ఉత్తమ్‌రెడ్డి, రాష్ట్ర బీసీ నేత తులసీధర్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, సోముశేఖర్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినా యుడు, సుధాకర్‌రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోతోంది. ఇటీవల కుక్కల దాడులతో అనేక మంది పిల్లలు, పెద్దలు తీవ్రగాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురైన సమయాలు అనేకం. గతంలో కుక్కల సంతతి ఎక్కువైతే పట్టుకుని చంపేసే వారు. సమాజంలో ఏ జంతువు, వన్యప్రాణి ప్రాణం తీసే అధికారం ఎవరికీ లేదని సుప్రీం కోర్టు ఆదేశాలతో పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా కుక్కల సంతతి విపరీతంగా పెరిగిపోవడంతో వాటిదాడులు మరీ ఎక్కువయ్యాయి. ఫలితంగా పలుసందర్భాల్లో పిల్లలు పెద్దల ప్రాణాలకే ప్రమాదం పొంచి వున్న పరిస్థితులు దాపురించాయి. తల్లిదండ్రులు ధైర్యంగా పిల్లలను రోడ్లమీదికి పంపలేని పరిస్థితి నెలకొంది. బుధవారం వాల్మీకిపురంలో 12 మంది చిన్నారులపై పిచ్చికుక్క దాడి జరిగింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కుక్కల సంతతిని అదుపుచేయలేకున్నారనే ఆరోపణలున్నాయి.

బాబోయ్

- శునకాల స్వైరవిహారంతో ఆందోళన
- విరుచుకుపడుతున్న పిచ్చి కుక్కలు
- వాల్మీకిపురంలో 12 మంది చిన్నారులపై దాడులు

ములకలచెరువు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారులు...ఇంటి పాటే ఉంటున్న వృద్ధులు...దారిలో వెళ్తున్న మహిళలు... ద్విచక్రవాహనాల్లో వెళ్తున్న వారిపై శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు తరచూ దాడి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తుడడంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నాలుగు నెలల్లో సుమారు 800 మందికిపైగా చిన్నారులు, వృద్ధులు, ద్విచక్రవాహన చోదకులు కుక్కల దాడిలో గాయపడ్డారు. ఒక్క ములకలచెరువు మండలంలోనే కుక్కల దాడిలో గాయపడి చికిత్స చేయించుకుంటున్న వారి సంఖ్య సుమారు 200 వరకు ఉంది. తాజాగా ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. వీధి, పిచ్చి కుక్కల దాడితో ప్రజలు భయాందోళ చెందుతున్నారు. నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో కుక్కల దాడులు అధికమయ్యాయి. ప్రధాన రహదారులు, వీధుల్లో గుంపులు, గుంపులుగా సంచరిస్తూ ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. చికెన్ దుకాణాల వద్ద కుక్కలు అధికంగా ఉంటూ విరుచుకుపడుతున్నాయి. చికెన్ దుకాణాల వద్ద వేస్ట్ ముక్కలు వేస్తుండడంతో వాటిని తింటూ అక్కడే గుంపులుగా ఉంటున్నాయి. ములకలచెరువులోని ముంబై - చెన్నై జాతీయ రహదారిలో పలు చోట్ల కుక్కల గుంపుల సంచారం ఎక్కువగా ఉంది. రాత్రి వేళ ద్విచక్రవాహనదారుల వెంట పడుతూ దాడి చేస్తున్నాయి. వీధి, పిచ్చి కుక్కల దాడులు ఎక్కువగా ఉన్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.



ఇటీవల కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారి వేదడ (ఫైల్)

పిచ్చికుక్కలు దాడి చేసిన కొన్ని ఘటనలు

- జనవరి 18న ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి న ఘటనలో ఐదు గ్రామాల్లో 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కో సం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిం ది. జనవరి 31వతేదీ, ఫిబ్రవరి 1వతేదీన ములకలచెరువులో పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఇళ్ల ముందు ఆడుకుంటున్న పలువురు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా కరిచింది.
- ఫిబ్రవరి 2వతేదీన పెద్దమండ్యం మండలం దట్టేనాయక్ తండాలో పిచ్చికుక్క వీరంగం సృష్టించి ముగ్గురిని గాయపర్చింది. వీరు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.
- తాజాగా ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ బిస్సయ్యగారిపల్లెకులో ఐదేళ్ల చిన్నారి వేదశ్రీపై పిచ్చికుక్క విచక్షణారహితంగా దాడి చేసి కరిచింది. తల, కళ్లపై కరవడంతో చిన్నారిని బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

నియంత్రణకు చర్యలు చేపడతాం

ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. కుక్కలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వాటిని పట్టి ఇతర చోట వదులుతాం. సంతతి నివారణకు పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి వ్యాక్సినేషన్ వేయించి శస్త్ర చికిత్స చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

మోహన్‌ప్రతాప్, ఈఓఆర్డీ, ములకలచెరువు





బుధవారం వాల్మీకిపురంలో కుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారులు





పిచ్చికుక్క వీరంగం

వాల్మీకిపురంలో 12మందికి పైగా చిన్నారులకు గాయాలు

వాల్మీకిపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం సాయంత్రం పిచ్చికుక్క దాడి చేయడంతో 12 మందికి పైగా చిన్నారులు గాయపడ్డారు. స్థానిక తోటవీధి ప్రాంతంలో సాయంత్రం వీధిలో ఆడుకుంటున్న చిన్నారులపై పిచ్చికుక్క దాడికి పాల్పడింది. అక్కడి నుంచి హసన్‌ఖాన్‌వీధి, బ్రాహ్మణ వీధి, రామాలయం రోడ్డు, హరిమందిరం, కోనేటివీధి, తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్క చేసిన వీరంగానికి పిల్లలు పెద్దలు సైతం పరుగులు తీశారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారులు సానియ, అయాన్, షణ్ముకం, అబీబా, దీక్షణ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. మరో ఏడుగురికి పైగా చిన్నారులు కుక్క దాడిలో గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నారు. పిచ్చికుక్క వీరంగాన్ని గమనించిన స్థానికులు మళ్లీ ప్రమాదం తలెత్తకుండా కుక్కను వెంబడించి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కుక్కను చంపేశారు. పట్టణంలో వీధుల వెంబడి ఎటు చూసినా కుక్కల బెడదతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.



స్థానికులు చంపేసిన పిచ్చికుక్క

కంటికి ఆపరేషన్ కూడా చేశారు. నియంత్రణ చర్యలు శూన్యం కుక్కలు ప్రజలపై విరుచుకుపడి దాడులు చేస్తున్నా నియంత్రణ చర్యలు ఎక్కడా కనపడడం లేదు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. గతంలో కుక్కలను పట్టుకుని బయటి ప్రాంతాలకు తీసుకెళ్లడమో లేదా సంతతి నియంత్రణకు కుక్కలకు శస్త్ర చికిత్స చేసేవారు. వైసీపీ పాలనలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోక పోవడంతో సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటికైనా సంబంధి త అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన పంచాయతీ ఆదాయం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

కలికిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కలికిరి పంచాయతీలో వారపు సంత సహా ఇతర వ్యవహారాల నిర్వహణ కోసం బుధవారం జరిపిన వేలం పాటల్లో గతేడాది కన్నా ఆదాయం పెరిగింది. గతేడాది జరిపిన వేలం పాటల్లో రూ.15.23 లక్షలు రాగా తాజాగా బుధవారం నిర్వహించిన వేలంలో మొత్తం రూ.21.93 లక్షలు సమకూరింది. మదనపల్లె డీఎల్పీఓ నాగరాజు వేలం పాటలు నిర్వహించారు. వారపు సంతను రూ.16 లక్షలకు కంట్రాక్టర్ అశోక్ రెడ్డి దక్కించుకున్నారు. దినసరి కూరగాయల మార్కెట్‌ను రూ.3 లక్షలకు అల్లావుద్దీన్ చేజిక్కించుకున్నారు. ప్రైవేటు బస్టాండులో రుసుములు వసూలు కోసం రూ.3.03 లక్షలకు ఇస్మాయిల్, జంతువధశాలను రూ.90 వేలతో స్వంతం చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్పంచు ఎల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

ప్రజలు కిడ్నీ జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డయాలసిస్ కేంద్రం డాక్టర్ శాశ్వితి

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రజలు కిడ్నీ జబ్బుపై అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డయాలసిస్ సెంటర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శాశ్వితి అన్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రపంచ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ అవసరమైన నీటిని ప్రజలు తీసుకోవాలన్నారు. తక్కువ ఉన్నా ఎక్కువ తీసుకున్నా అది కిడ్నీపై ప్రభావం చూపుతుందన్నారు. రంగు కలిపిన ఆహారప్రదార్థాలు తీసుకోవడం, మద్యం, పొగతాగడం, షుగర్ వ్యాధి ఉన్నవారిలో కిడ్నీ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. శరీరంలోని వ్యర్థాలను ఫిల్టర్ చేయగల సామర్థ్యం కిడ్నీలకు మాత్రమే ఉందన్నారు. కావున కిడ్నీలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. డయాలసిస్ కేంద్రం మేనేజరు బాలు, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను పెంపొందించుకోవాలి

డ్రోన్ టెక్నాలజీపై మిట్స్‌కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్



డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కురబలకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. బుధవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీ క్లబ్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో వందకు పైగా డ్రోన్ పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపడుతోందన్నారు. దీని కోసం డ్రోన్ పాలసీ 4.0ను రూపొందించిందన్నారు. డ్రోన్ తయారీ, సేవలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. విజయవాడ వరదల సమయంలో డ్రోన్‌ద్వారా ఆహారం, నీటిని సరఫరా చేసి సహాయక చర్యలు చేపట్టారన్నారు. విద్యార్థులు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఈ పోటీలు ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా ఈ రంగంపై దృష్టి సారించి లోపాలను గుర్తించి వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించి విజయాలను సాధించాలన్నారు. వీటిపై నైపుణ్యాలను ప్రదర్శిస్తే భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరం జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, బోధన ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో 17వ తేదీ నుంచి మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.150లు నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చన్నారు. టెన్త్ మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలుంటాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

శేషవాహనంపై లక్ష్మీనరసింహస్వామి

17న పాపేపల్లి తిరునాళ్ల



హనుమంత వాహనంపై లక్ష్మీనరసింహ స్వామి

పెద్దమండ్యం, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): కుషావతి నది తీరంలో ఏకశిలగుట్టపై మాండవ్య మహర్షిచే ప్రతిష్ఠింపబడిన లక్ష్మీనరసింహస్వామి శేషవాహనంపై భక్తులకు అభయం నొసంగారు. పాపేపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 11వ తేదీ నుంచి 20 వరకు జరుగనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మునిరాజ, బ్రహ్మోత్సవాలు నిర్వహాకులు వెల్లడించారు. లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి లక్ష్మీనరసింహ స్వామి హనుమంతవాహనంపై పురవీధుల్లో విహరించారు. 13న సింహవాహనం, 14న శేషవాహనం, 15న గజవాహనం, 16న గరుడవాహనం, 17న రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం, తిరునాళ్ల జరుగు తుందన్నారు. 18న అశ్వవాహనం, 19న వసంతో త్సవం, 20న శయనోత్సవం కార్యక్రమాలు జరుగతాయని తెలిపారు.

రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధరణీ కుమార్

పీలేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాలలకు అన్యాయం చేసేలా ఉన్న రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణతో దళిత కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజీవ్ మిశ్రా కమిషన్ నివేదికలో రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న మాలలకు కేవలం 7.5 శాతం రిజర్వేషన్ కేటాయిండం ఆక్షేపణీయమ న్నారు. జనాభాలో 4 శాతం లేని మాదిగలకు 6.5% రిజర్వేషన్ కల్పించి పెద్దపీట వేశా రన్నారు. 3 శాతం ఉన్న రెల్లి సామాజిక వర్గానికి కేవలం 1 శాతం రిజర్వేషన్ కల్పించి అన్యాయం చేశారన్నారు. వర్గీకరణతో దళితులకు అన్యాయం జరుగుతుందని తెలిసే మాలమహానాడు 30 ఏళ్లుగా దానికి వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. నేతలు జెట్టి మల్లికార్జున, కొప్పుల వినయ్ కుమార్, కార్తీక్, నీలా మనోజ్ కుమార్, ప్రభుదేవా, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లారి చిత్రపటానికి పాలాభిషేకం



నల్లారి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

పీలేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో తమ సమస్య లను గుర్తుంచుకుని అసెంబ్లీలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రస్తావించడం సంతోషదాయకమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందిస్తే కేవలం సన్మానాలు లభించాయే తప్ప జీతాలు పెరగలేదని వాపోయారు. కిశోర్ కుమార్ రెడ్డి చొరవతోనైనా తమ సమస్యలు ప్రభుత్వానికి తెలియడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈట గురుమోహన్, టీడీపీ నేతలు కోటపల్లె బాబు, ఆర్‌బీఐ రమణా రెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, కోడి రామకృష్ణారెడ్డి, స్పోర్ట్స్ మల్లి, నల్లారి రియాజ్, ఆంజి, ప్రసాద్, కార్మికులు పులి రెడ్డప్ప, నాగార్జున, రాణెమ్మ, ఓబులేశు, వైఎస్ఆర్ మస్తాన్, ముబారక్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను సత్వరం పరిష్కరించాలి

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్



రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలికిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వివిధ సందర్భాల్లో ప్రజలు అందజేసిన అర్జీలన్నీ సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. బుధవారం ఎమ్మార్వో కార్యాలయంలో ఆయన రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. వారం వారం నిర్వహించే ప్రజా వేదిక అర్జీలు, గతంలో నిర్వహించిన రెవెన్యూ సభలు, రీసర్వే సభల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఫ్రీహోల్డ్ భూములు రీవెరిఫికేషన్ క్షేత్ర స్థాయిలో పూర్తయిన వాటి వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. శనివారం లోపు ఆన్‌లైన్ నమోదుకు గడువిచ్చారు. సమావేశంలో తహసీల్దారు మహేశ్వరీబాయి, డిప్యూటీ తహసీల్దారు నవీన్, మండల సర్వేయర్ రెడ్డెప్ప, వీఆర్వోలు పాల్గొన్నారు.

మామిడి పూతను కాపాడుకోండి

నేడు అవగాహన సమావేశం

కలికిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాంతాల్లోనూ విస్తారంగా విరబూసిన మామిడి పూతను కాపాడుకోవాలని పీలేరు, వాల్మీకిపురం ఉద్యాన శాఖ అధికార్లు సుకుమార్ రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూత, పిందె దశల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించేందుకు గురువారం స్థానిక కేవీకేలో సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మామిడి కాయల నాణ్యత తగ్గకుండా వుండేందుకు ఫ్రూట్ కవర్ల వాడకంపై కూడా ఒక రోజు శిక్షణ వుంటుందని ఆయన చెప్పారు. కలికిరి, వాల్మీకిపురం మండలాల మామిడి రైతులందరూ పాల్గొనాలని కోరారు. అన్ని రకాల సందేహాల నివృత్తికి వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులో వుంటారని వివరించారు.

విష్వక్సేన ఆరాధన

మదనపల్లె అర్బన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వేంకటరమణ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో విశ్వక్సేన ఆరాధన, హోమాలు నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛారణతో కార్యక్రమం ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీజే పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. గురువారం ప్రసన్న వేంటకమణస్వామి కల్యాణోత్సవం, సరస్వతీ పూజలు నిర్వహించనున్నట్లు బీజే పాండు తెలిపారు. సాయంత్రం పౌర్ణమి సందర్భంగా స్వామిని గరుడవాహనంపై ఊరేగిస్తారన్నారు. భక్తులు కల్యాణోత్సవం, అక్షరాభ్యాసంలో పాల్గొనాలని కోరారు.

గురుకులం ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులంలో 2025-26లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధారాణి తెలిపారు. 5వ తరగతిలో సాధారణ ప్రవేశాలు, 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ప్రవేశాలు చేపట్టినట్లు ఆమె వివరించారు. ఆసక్తి గలవారు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు తనను 8328079900 నెంబరులో సంప్రదించాలని ఆమె తెలిపారు.

రేపు పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలు జరగనున్నాయి. ఉదయం 9గంటల నుంచి ఆలయ మండపంలో సత్యనారాయణ వ్రతం, సాయంత్రం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, రాత్రికి కార్యసిద్ధి అభయ ఆంజనేయ స్వామికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాల సేవలు, పౌర్ణమి వెలుగులో పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు.

గర్భిణుల సేవలపై విచారణ



మెడికల్ ఆఫీసర్ హసీనాతో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ సంధ్య సమీక్షించారు. బుధవారం ఆమె ఆస్పత్రి సిబ్బంది, గర్భిణులతో మాట్లాడారు. ప్రతినెలా 9వ తేదీన ప్రత్యేక కార్యక్రమం ద్వారా చేపడుతున్న చర్యలపై విచారించారు.

19న సంత, బస్టాండు గేటు వేలం

నిమ్మనపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని వారపుసంత, బస్టాండు, షాపింగ్ రూములు 19న వేలం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ చలపతిరావు, కార్యదర్శి వెంకటరమణ పేర్కొన్నారు. డివిజినల్ పంచాయతీ అధికారి ఆదేశాలపై ఏడాదికి సంబంధించి వారపు సంత, బస్టాండు గేటు, షాపింగ్ రూములను 19న ఉదయం 11గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం వేస్తారన్నారు. పాటదారులు ముందుగా రూ.2లక్షలు డిపాజిట్ కట్టి పాటలో పాల్గొనాలన్నారు. వివరాలకు 7013954625ను సంప్రదించాలని తెలిపారు.

వేలం పాటలు వాయిదా

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో బుధవారం నిర్వహించాల్సిన వేలం పాటలు మరోసారి వాయిదా పడ్డాయి. ఇటీవల నిర్వహించిన వేలంపాటల్లో వారపుసంత, ప్రైవేటు బస్టాండును పాడుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో 12కు వాయిదా వేయగా మరోసారి వాయిదా వేసి 13న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వారపుసంతకు రూ.4 లక్షలు ధరావతు, రూ.5లక్షలు, ప్రైవేటు బస్టాండుకు రూ.3లక్షలు ధరావతు, రూ.3.50 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



పీలేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా దుబ్బా శ్రీకాంత్ మరోమారు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన పీలేరు అధ్యక్షుడిగా పనిచేస్తుండగా పార్టీ అధిష్టానం మరోమారు ఆయనను నియమించింది. శ్రీకాంత్ మాట్లాడుతూ తన పనితీరును గమనించిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తనకు మరోమారు పార్టీ పగ్గాలు అందించారన్నారు

జనసేన సమన్వయ కర్తగా రెడ్డెప్ప

వాల్మీకిపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జనసేన సమన్వయ కర్తగా వాల్మీకిపురం వాసి పొలిమేరు రెడ్డెప్ప నియమితులయ్యారు. పిఠాపురం (చిత్రాడ)లో 14న నిర్వహించనున్నన జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలో భాగంగా తనను నియమించినట్లు రెడ్డెప్ప వివరించారు. నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పిఠాపురం చేరుకుని ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలన్నారు.